ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
మంగళవారం 1 ఏప్రిల్ 2025





రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, డేగల

పన్ను వసూలులో.. మున్సిపాలిటీలు



- పురాల్లో పన్ను వసూలు 45.40 శాతమే
- లక్ష్యాల సాధనలో వెనుకంజ
- కలసి రాని 50 శాతం వడ్డీ రాయితీ
- పన్ను వసూలు లక్ష్యం రూ. 643.67 కోట్లు
- వసూలు చేసింది రూ. 292.24 కోట్లు
- ఇంకా బకాయిలు రూ. 351.43 కోట్లు
- రాష్ట్ర స్థాయిలో వినుకొండ ద్వితీయ.. అద్దంకి తృతీయ స్థానం
- అట్టడుగున చిలకలూరిపేట మునిసిపాల్టీ

ఆర్థిక సంవత్సరం ముగిసింది. పన్నుల వసూలుకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడంలో మునిసిపాలిటీలు వెనుక బడ్డాయి. ప్రభుత్వం 50 శాతం వడ్డీ మాఫీ అవకాశం కల్పించినా కలసి రా లేదు. పన్ను చెల్లించేందుకు పురాల పౌరులు ముందుకు రాలేదు. అయితే గత ఏడాది కంటే 2.23 శాతం పన్ను వసూలు పెరిగింది. గత ఏడాది 43.17 శాతం పన్ను వసూలు కాగా ఈ ఏడాది 45.40 శాతం పన్ను వసూలైంది. ఆస్తి, తాగునీటి పన్ను వసూలు లక్ష్యం 643.67 కోట్లు కాగా, 292.24 కోట్లు పన్ను వసూలైంది. ఇంకా ఆస్తి, తాగునీటి పన్ను బకాయిలు భారీగా పేరుకుపోగా, రూ 351.43 కోట్లు పన్నులు వసూలు కావాల్సి ఉంది. పన్ను వసూలులో రాష్ట్ర స్థాయిలో వినుకొండ ద్వితీయ, అద్దంకి తృతీయ స్థానంలో నిలిచాయి. చిలకలూరిపేట మునిసిపాల్టీ అట్టడుగున ఉంది.

మునిసిపాలిటీల వారీగా ఆస్తి పన్ను వసూలు ఇలా..

మునిసిపాలిటీ	లక్ష్యం కోట్లలో	వసూలైన పన్ను కోట్లలో	శాతం
పల్నాడు జిల్లా :			
నరసరావుపేట	20.59	11.20	54.42
చిలకలూరిపేట	22.40	8.86	39.54
వినుకొండ	6.30	5.18	82.22
సత్తెనపల్లి	8.75	5.15	58.83
మాచర్ల	7.63	4.05	53.15
పిడుగురాళ్ళ	6.97	4.82	69.11
దాచేపల్లి	2.49	1.61	64.72
గురజాల	1.90	1.25	65.49
గుంటూరు జిల్లా :			
గుంటూరు	320.52	134.50	41.96
తెనాలి	30.07	18.20	60.54
మంగళగిరి, తాడేపల్లి	48.98	37.56	76.68
పొన్నూరు	7.40	4.98	67.30
బాపట్ల జిల్లా :			
రేపల్లె	6.57	4.85	73.85
బాపట్ల	12.90	6.29	48.76
చీరాల	13.69	9.04	66.08
అద్దంకి	5.12	4.09	80.01

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని మునిసిపాల్టీల్లో రూ. 522.28 కోట్లు ఆస్తి పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ 261.09 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను రూ 121.39 కోట్లు కాగా రూ 31.15 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను రూ 261.19 కోట్లు, తాగునీటి పన్ను రూ 90.24 కోట్లు వసూలు కావాల్సి ఉంది. ఆస్తి పన్ను 49.99 శాతం, నీటి పన్ను 25.66 శాతం వసూలైంది. పల్నాడు జిల్లాలోని చిలకలూరిపేట మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను 40 శాతం లోపే ఉంది. పల్నాడు జిల్లాకు సంబంధించి మునిసిపాల్టీలలో రూ 77.03 కోట్లు పన్ను వసూలు చేయాల్సి ఉండగా రూ. 42.07 కోట్లు వసూలైంది. 54.61 శాతం ఆస్తి పన్ను వసూలు చేశారు. తాగునీటి పన్ను రూ . 22.37 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. నీటి పన్ను రూ. 7.07 కోట్లు వసూలు చేయగా వసూలు శాతం 31.60 గా ఉంది. వినుకొండ మునిసిపాల్టీ 82.22 శాతం ఆస్తిపన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి బకాయిలు భారీగా పేరుకుపోయాయి. వడ్డీ మాఫీ చేసినా బకాయిదారులు స్పందించ లేదు.

- గుంటూరు కార్పొరేషన్‌తో సహా జిల్లాలో రూ. 406.97 కోట్లు ఆస్తి పన్ను, రూ 91.83 కోట్లు నీటి పన్ను వసూలు లక్ష్యం కాగా ఆస్తి పన్ను రూ. 194.76 కోట్లు, నీటి పన్ను రూ. 21.77 కోట్లు వసూలు చేశారు. ఆస్తి పన్ను 47.86 శాతం, నీటి పన్ను 23.70 శాతం వసూలైంది. ఈ జిల్లాలో కేంద్ర ప్రభుత్వం కార్యాలయాలకు సంబంధించి దాదాపు 10 కోట్లు పన్ను బకాయి పేరుకుపోయింది. వీటి నుంచి పన్ను వసూలు కాలేదని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యాలయాల పన్ను బకాయి రూ. 29 కోట్లకు పైగా ఉండగా నామమాత్రంగానే పన్ను వసూలైంది. గుంటూరు కార్పొరేషన్ పన్ను వసూలులో అలసత్వం వలన 41.96 శాతమే పన్ను వసూలైంది.
- బాపట్ల జిల్లాలో మునిసిపాల్టీలలో ఆస్తి పన్ను రూ 38.28 కోట్లు లక్ష్యం కాగా రూ 24.26 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను 7.18 కోట్లకు రూ 2.31 కోట్లు వసూలైంది. ఆస్తి పన్ను 63.39 శాతం, నీటి పన్ను 32.20 శాతంగా నమోదైంది. బాపట్ల మున్సిపాల్టీ మునిసిపాల్టీలో 48.76 శాతం మాత్రమే పన్ను వసూలు చేశారు. అద్దంకి మునిసిపాల్టీ 80.01 శాతం పన్ను వసూలు చేసి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది.



ఘనంగా రంజాన్



ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ముస్లిం సోదరులు నెల రోజులుగా చేసిన కఠోర ఉపవాస దీక్షలను ముగించుకుని రంజాన్ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. ఉదయాన్నే సంప్రదాయ దుస్తులు ధరించి భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. అంజుమన్ ఈ ఇస్లామియా సంస్థ ఆధ్వర్యంలో నగరంపాలెంలోని ఈద్గా, పొన్నూరు రోడ్డులోని ఈద్గాల వద్ద ఉదయాన్నే పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు చేరుకొని ప్రార్థనలు నిర్వహించారు. మత పెద్దల బోధనలు వినిపించి సమాజంలో శాంతితో పాటు ప్రజలంతా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాక్షించారు. నగరంలోని పట్టాభిపురం, గుజ్జనగుండ్ల, ఎత్తురోడ్డు సెంటర్, శ్రీనివాసరావుపేట, నల్లచెరువు, పొన్నూరు రోడ్డు, మాయబజార్ ప్రాంతాల్లోని మసీదుల్లో ముస్లిం సోదరు లంతా రంజాన్ ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల ఎదుట ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మరోవైపు హిందూ, ముస్లిం సోదరులు కూడా ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ శుభాకాంక్షలు తెలుపుకోవటం మతసామరస్యాన్ని వెల్లివిరిసేలా చేసింది.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్, మస్తాన్‌వలి, జియావుద్దీన్, ముస్తఫా

పలువురు ప్రముఖుల ప్రార్థనలు

పొన్నూరు రోడ్డులోని ఆంధ్రముస్లిం కళాశాలలోని ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో తూర్పు ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యేలు ఎండీ ముస్తఫా, షేక్ మస్తాన్‌వలి, నంబూరు సుభాని, జియావుద్దీన్‌లు పలువురు నాయకులు రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు. అలానే నగరంపాలెంలోని ఈద్గాలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఐడీసీ ఛైర్మన్ డేగల ప్రభాకర్‌లు ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేశారు. అనంతరం ము స్లిం సోదరులను ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

రంజాన్ నియమాలతో ఎంతో నేర్చుకోవచ్చు: పెమ్మసాని

పవిత్ర రంజాన్ మాస ఉపవాసం, నియమనిష్టలతో ఎంతో నేర్చు కోవచ్చని కేంద్రగ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. నగరంపాలెం ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో హాజరైన కేంద్ర మంత్రి పెమ్మసానికి మత పెద్దలు ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరీ, సోదరులు పాటించే ఉపవాస దీక్షల వల్ల పేదవాడి ఆకలి బాధను అందరూ తెలుసుకునే అవకాశం ఉందన్నారు. కోపం, ఆవేశం, స్వార్థం అనే ఎన్నో దుర్గుణాలను మనిషికి ఎలా దూరంగా ఉంచాలి అనేది ఈ రంజాన్ పవిత్ర మాసం నేర్పిస్తుందన్నారు.

● రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి: ఎమ్మెల్యే నసీర్

అల్లా ఆశీర్వాదంతో రాష్ట్రం సుభి క్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ కోరుకున్నారు. పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాల ఆవరణలో ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, దానధర్మాలు, కఠోర దీక్షతో నెల రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించారని, తద్వారా మనిషి జీవితాన్ని సక్రమ మార్గంలో ఎలా నడుచుకోవాలో బోధపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీ లకు మంచి రోజులొచ్చాయన్నారు. గతంలో ముస్లిం మైనారిటీలపై దాడులు జరిగేవని, ఇప్పుడు మైనారిటీలకు ప్రభుత్వం రక్షణగా నిలుస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మౌజన్లు, ఇమామ్‌లకు గౌరవ వేతనం విడుదల చేసి వారి ఆత్మ గౌరవాన్ని మరింత పెంచారని తెలిపారు.

రంజాన్ ప్రార్థనల్లో కోవెలమూడి రవీంద్ర

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 39వ డివిజన్ గుజ్జనగుండ్ల వద్ద రంజాన్ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన నమాజ్ కార్యక్రమం లో టీడీపీ జోన్- 5 ఇన్‌చార్జి కోవెల మూడి రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు.



ప్రార్థనల్లో పాల్గొన్న చిన్నారులు

పాత మద్రాసు రోడ్డుకు మహర్దశ

నాలుగు లైన్ల విస్తరణకు గ్రీన్ సిగ్నల్

ప్రత్తిపాడు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హోదాలో నాడు జగన్ మోహన్ రెడ్డి ప్రత్తిపాడు వచ్చిన సందర్భంలో ఇచ్చిన ఒక్క హామీ నెరవేర లేదు. అందులో ప్రత్తిపాడు సెంట్రల్ లైటింగ్ కూడా ఒకటి. అయితే చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుంటూరు - పర్చూరు పాత మద్రాసు రోడ్డు కొంత మేర విస్తరణతో పాటు, ప్రత్తిపాడులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు రూ. 60 కోట్లు నిధులు మంజూరు అయ్యాయి. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ప్రత్తిపాడు అభివృద్ధికి తొలి అడుగు పడింది. గత తెలుగుదేశం పార్టీ హయాంలో అప్పటి మంత్రి రావెల కిషోర్ బాబు గుంటూరు నుంచి పుల్లడిగుంట వరకు రోడ్డు విస్తరణ చేపట్టారు. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో రెండో విడత పనులకు బ్రేకులు పడ్డాయి. తిరిగి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోనికి రావడంతో గుంటూరు - పర్చూరు పాతమద్రాసు రోడ్డులో ఆగిన చోట నుంచి రెండో విడత పనులకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ మేరకు ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు రోడ్డు విస్తరణకు 60 కోట్లు నిధులు మంజూరైనట్లు ప్రకటించారు. సీఆర్ఐఎఫ్ గ్రాంటు క్రింద 60 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రామాంజనేయులు ఎన్నికల హామీలో భాగంగా ప్రత్తిపాడుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించి నిధుల మంజూరులో కీలకంగా వ్యవహరించారు. ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో రామవాగు నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు రోడ్డు విస్తరణతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ప్రత్తిపాడులో రోడ్డు విస్తరణకు కావాల్సిన స్థలాన్ని కూడా సేకరించనున్నారు. దీంతో ప్రత్తిపాడు రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. దీనికి సంబంధించి ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు తయారు చేశారు. ఈ ఏడాదిలోనే పనులు ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయి.

పేరు పెట్టకముందే.. పైలోకాలకు..

- తెనాలిలో పెను విషాదం
- పులిగడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- మృతుల్లో 20 రోజుల పసికందుతో సహా ఐదేళ్ల చిన్నారి కూడా
- మోపిదేవి ఆలయంలో నామకరణం కోసం వెళుతూ...
- ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో విషాద ఛాయలు

6

నేటి నుంచి దీపం-2 బుకింగ్స్



- తొలి దశలో 3.70 లక్షల మందికి పైగా లబ్ధి
- ఈసారి బుకింగ్‌లు ఏప్రిల్ నుంచి జూలై వరకు
- రూ. 148 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం

గుంటూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): దీపం-2 ఏడాదికి ఉచితం మూడు వంట గ్యాస్ రీఫిల్ సిలిండర్ల పంపిణీ పథకం రెండో దశ బుకింగ్స్ మంగళవారం(ఏప్రిల్ 1వ తేదీ) నుంచి ప్రారంభం కానున్నాయి. గత ఏడాది అక్టోబరు 31వ తేదీన ప్రారంభమైన తొలి విడత బుకింగ్స్ ఈ నెల 31వ తేదీ ఆదివారంతో ముగిశాయి. తొలి విడతలో గుంటూరు జిల్లా వ్యాప్తంగా 3.70 లక్షల మంది వంట గ్యాస్ వినియోగదారులు ఈ పథకాన్ని వినియోగించుకొని 100 శాతం రీఫిల్ ధరని సబ్సిడీ రూపంలో పొందారు. ఇందుకోసం ప్రభుత్వం రూ. 30.01 కోట్లను విడుదల చేసింది. కేవలం రేషన్ కార్డు, ఆరు అంచెల మూల్యాంకనం ఆధారంగా మాత్రమే చేసుకొని అర్హులను దీపం-2 పథకం కింద ఎంపిక చేసింది.

ఏడాదికి మూడు ఉచిత సిలిండర్ల సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం గుంటూరు జిల్లాకు 148.830 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మంగళవారం నుంచి ప్రారంభం కాబోతున్నది. దీంతో ఏప్రిల్ నుంచి జూలై వరకు బుకింగ్స్‌ని ప్రారంభించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అలానే ఈ ఆర్థిక సంవత్సరంలో రెండో విడత బుకింగ్స్ ఆగస్టు నుంచి నవంబరు వరకు, మూడో విడత డిసెం బరు నుంచి మార్చి వరకు జరుగుతాయి. కాగా తొలి విడతలో 514 రీయింబర్స్‌మెంట్ ఫెయిల్యూర్ కేసులు నమోదు కాగా వాటికి ఆన్‌లైన్ రిపోర్టులో కారణాలను తెలుసుకొన్నారు. ఎందుకు సబ్సిడీ మొత్తం పడలేదో కూడా లబ్ధిదారులకు తెలియ జేశారు. 137 మంది పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయగా వాటిని పరిష్కరించారు.



డీఆర్ఎంగా సుదేషన సేన్

- అకౌంట్స్ విభాగం అధికారికి ప్రప్రథమంగా పోస్టింగ్
- ఆమె భర్తకు కూడా మైసూరు డీఆర్ఎంగా పోస్టింగ్

గుంటూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ ఏర్పడిన తర్వాత ప్రప్రథమంగా అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న అధికారికి డివిజనల్ రైల్వే మేనేజర్ పోస్టింగ్ లభించింది. ఇప్ప టివరకు పర్సనల్, ఇంజనీరింగ్ విభాగాల్లో విధులు నిర్వహించిన అధికారులకే గుంటూరు డీఆర్ఎం పోస్టింగ్ లభిస్తూ వచ్చింది. ఈ సాంప్రదాయానికి ఫుల్‌స్టాప్ పెడు తూ అకౌంట్స్ విభాగం నుంచి నార్తన్ రైల్వేలో ఎన్ఎఫ్‌హెచ్ఏజీ హోదాలో విధులు నిర్వ హిస్తున్న ఐఆర్ఏఎస్ అధికారిణి సుధేషన సేన్‌ని గుంటూరు డివిజన్‌కి రైల్వేబోర్డు పోస్టింగ్ చేసింది. దీంతో ఆమె అక్కడ రిలీవింగ్ అయి వారం వ్యవధిలో గుంటూరు రైల్వే డివిజన్ ప్రధాన కార్యాలయానికి వచ్చి నూతన డీఆర్ఎంగా బాధ్యతలు స్వీకరిస్తారని రైల్వేవర్గాలు తెలిపాయి. దీంతో మూడు నెలల క్రితం గుంటూరు డీఆర్ఎంగా పోస్టింగ్ చేసిన లిల్లీ పాండేయ ఉత్తర్వులు రద్దు అయినట్లుగా రైల్వేబోర్డు పేర్కొన్నది. కాగా సుధేషన సేన్ భర్త ముదిత్ మిట్టల్ కూడా ఐఆర్ఎస్ అధి కారిగా రైల్వేలో కొనసాగుతున్నారు. ఆయ న్ని కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు రైల్వే డివిజన్‌కు డీఆర్ఎంగా రైల్వే బోర్డు పోస్టింగ్ చేసింది. భారతీయ రైల్వేల చరిత్రలో భార్యాభర్తల్ని ఒకే ఆర్డర్‌లో డీఆర్ఎంలుగా నియమించడం ఇదే ప్రప్రథమంగా రైల్వేవర్గాలు చెబుతున్నాయి. వీళ్లిద్దరూ 1997 ఐఆర్ఏఎస్ బ్యాచ్ అధికారులు కావడం విశేషం.

రెండు రోజులు.. 500 రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి జిల్లాలో మూడున్నర కోట్ల ఆదాయం

గుంటూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక సం వత్సరం చివరి రెండు రోజులు ప్రభుత్వ సెలవు దినాలు రావడంతో రిజిస్ట్రేషన్ శాఖ ముందస్తుగా అప్రమత్త మైంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచడంతో పాటు అదే సమయంలో ఆర్థిక సంవత్సరం చివరి రోజు ల్లో ఆస్తుల క్రయ విక్రయాలు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో గత ఆది, సోమవారాల్లో జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల కార్యాలయాలు కొనసాగాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ద్వారా మూడున్నర కోట్ల రూపాయలు ప్రభుత్వానికి అదనంగా ఆదాయం సమకూరింది. మొత్తంగా సుమారు 500 దస్తావేజుల రిజిస్ట్రేషన్ చేశారు. గుంటూరు జిల్లాలో సుమారు 200 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరగ్గా ప్రభుత్వానికి రెండున్నర కోట్లు ఆదాయం వచ్చింది. తొలి రోజు గుంటూరు జిల్లాలో కోటి 60 లక్షలు రాగా, రెండో రోజు సోమవారం 80 లక్షలు వరకు ఆదాయం వచ్చింది. బాపట్ల జిల్లాలో రెండు రోజుల్లో 170 దస్తావేజుల రిజిస్ట్రేషన్ జరగా కేవలం 40 లక్షలు మాత్రమే ఆదాయం సమకూరింది. పల్నాడు జిల్లాలో రెండు రోజుల్లో 125 దస్తావేజుల రిజిస్ట్రేషన్ జరగ్గా 60 లక్షల ఆదాయం వచ్చింది.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

రేపటి నుంచి అమలు చేయాలని యోచన

గుంటూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఆస్తుల క్రయ విక్రయాలకు సంబంధించి దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు గాను ప్రభుత్వం ఇకనుంచి స్లాట్ బుకింగ్ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. అంటే అంతా ఒకేసారి రిజిస్ట్రేషన్ ప్రక్రియకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు హాజరైతే వారంతా కార్యాలయాల్లో గంటల కొద్ది పడి కాపులు కావలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం లేకుండా ఆయా కక్షిదారులు సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లో పడిగాపులు కాయాల్సిన పని లేకుండా స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తీసుకురావాలని నిర్ణయించారు. అయితే ముందుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని ప్రధాన సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లోని దీనిని అమలు చేయాలని నిర్ణయించారు. ఏప్రిల్ రెండో తేదీ నుంచి దీనిని అమలు చేయాలని ఇప్పటికే మౌఖిక ఆదేశాలు వచ్చాయి. అయితే రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఉత్తర్వులు ఇంతవరకు వెలువడలేదు. అయితే ఈ స్లాట్ బుకింగ్ విధానాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఈ నెల నాలుగున విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో ప్రారంభించబోతున్నారు. అయితే ఈ విధానాన్ని ఈ నెల రెండు నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయాల్సిందిగా ఉన్నతాధి కారులు చెప్పినప్పటికీ అధికారిక ఉత్తర్వులు రాకపోవ డంతో దీని అమలుపై స్పష్టత రాలేదు. ఆది, సోమవా రాలు ఆర్థిక సంవత్సరం చివరి రోజులు కావడంతో పని దినాలుగా మార్చడంతో రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు ఈ రెండు రోజుల కార్యకలాపాలపై దృష్టి సాధించిన నేపథ్యంలో బుధవారం నుంచి దీనిని అమలు చేస్తారా లేదంటే తేదీని మారుస్తారా అనేది తెలియ రాలేదు. దీనిపై మంగళవారం రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు భావిస్తున్నాయి.

అడహాక్ ప్రమోషన్లపై దుమారం

◆ ఒక్కో పోస్టుకు రూ. 50 వేలు నుంచి రూ. లక్ష

గుంటూరు సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మార్కెటింగ్ శాఖ అడహాక్ ప్రమోషన్లపై దుమారం చెలరేగింది. అర్హత లేని వారికి ప్రమోషన్లు ఇప్పించేందుకు తెర వెనుక సాగుతున్న ప్రయత్నాలు వివాదాస్పదంగా మారాయి. గత ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రమోషన్ల పేరుతో నగదు వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలు హాట్ టాపిక్‌గా మారాయి. రాష్ట్రంలో 141 మంది అడహాక్ ప్రమోషన్లు పొందేందుకు ఫైల్ రూపొందించారు. మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయంలో ఈ తంతును ముగించారు. అసిస్టెంట్ సెక్రెటరీలు 50 మంది, గ్రేడ్- 3 సెక్రటరీలు 39, గ్రేడ్-2 సెక్రెటరీలు 28 మంది, గ్రేడ్-1 సెక్రెటరీలు 13 మంది, స్పెషల్ గ్రేడ్ సెక్రటరీలు 11మంది, సెలక్షన్ గ్రేడ్ ఆరుగురు ప్రమోషన్లు పొందేందుకు వీలుగా ఫైల్ సిద్ధం చేశారు. జీఓ తీసుకువచ్చేందుకు మంతనాలు ఆరంభించారు. ఎవరైతే అడహాక్ ప్రమోషన్ల జాబితాలో ఉన్నారో వాళ్ల ఒక్కొక్కరు రూ. 50 వేలు నుంచి రూ.లక్ష వరకు చెల్లించాల్సి ఉంటుందని నిర్ణయించినట్లు తెలుస్తుంది. అందులో భాగంగా మొదటి విడతగా రూ. 30 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మిగిలిన మొత్తం జీఓ వచ్చిన తరువాత అందజేసే విధంగా ఉద్యోగుల మధ్య ఒప్పందాలు కుదిరినట్టు చెబుతున్నారు. మొదటి విడత సొమ్మును వసూలు చేసేందుకు ప్రాంతాల వారీగా సెక్రెటరీలకు బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. కోస్తా ప్రాంతంలో మొదటి విడత మామూళ్ల సొమ్మును వసూలు చేసేందుకు ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు సెక్రెటరీలను నియమించగా, రాయలసీమ ప్రాంతంలో వసూళ్లకు చిత్తూరుకు చెందిన మరో సెక్రెటరీకి బాధ్యతను అప్పగించినట్లు తెలిసింది. మొత్తం ఈ వ్యవహారంలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన కొందరు కీలక పాత్ర పోషిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి ప్రమోషన్లు పొందడానికి అర్హతలు లేనప్పటికీ దొడ్డిదారిన ఉన్నత పోస్టుల్లోకి రావడానికి సాగుతున్న అడహాక్ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతోంది.

పీ4 విధానం నిరుపేద కుటుంబాలకు వరం: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది నాడు ముఖ్యమంత్రి చంద్రబాబు పీ4 విధానానికి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలోని పేద కుటుంబాలకు వరమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో చంద్రబాబు తనకు తానే సాటిగా నిలుస్తారన్నారు. ఈ పథకం దేశానికే మార్గదర్శకంగా నిలవనుందని వివరించారు. అట్టడుగు వర్గాల అభ్యున్నతికి సంపన్న వర్గాలు చేయూతనివ్వడమే పీ4 విధానమన్నారు. ఈ ప్రకటనతో వైసీపీలో వణుకు మొదలైందని, ఇది ఆచరణలోకి వచ్చి, పేదల జీవితాలు మారితే తమకు ఓట్లు రావన్నదే ఆ పార్టీ భయమన్నారు. 40 లక్షల కుటుంబాలను ప్రభుత్వం పీ4కు అర్హత కలిగినవిగా గుర్తించిందని, ప్రభుత్వం నేరుగా ఆయా కుటుంబాలతో అనుసంధానం కాకుండా, లబ్ధిదారులకు, సంపన్నవర్గాలకు మధ్య వారధిగా ఉండి పర్యవేక్షిస్తుందన్నారు. ఈ ప్రక్రియలో కుటుంబాలు, దాతలు ఎవరికి వారే స్వచ్ఛందంగా, మన స్ఫూర్తిగా పీ4లో భాగస్వాములై, తమ జీవితాలకు సార్థకత చేకూర్చుకోవచ్చునని తెలిపారు.

పేరు పెట్టకముందే.. పైలోకాలకు...



లారీని ఢీకొన్న కారు

వారసుడు పుట్టాడని ఆనందంగా దైవ దర్శనానికి బయలుదేరిన ఓ కుటుంబాన్ని మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురి ఉసురు తీసింది. మరో ఇద్దరిని తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలుజేసింది. ఈ హృదయ విదారక ఘటన అవనిగడ్డ మండలం పులిగడ్డ జాతీయ రహదారిపై సోమవారం జరిగింది.

- తెనాలిలో పెను విషాదం
- పులిగడ్డ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
- మృతుల్లో 20 రోజుల పసికందుతో సహా ఐదేళ్ల చిన్నారి కూడా
- మోపిదేవి ఆలయంలో నామకరణం కోసం వెళుతూ...
- ఒకే కుటుంబంలో నలుగురు మరణించడంతో విషాద ఛాయలు

తెనాలి, అవనిగడ్డ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : లేక లేక పుట్టిన 21 రోజుల పసికందుకు నామకరణం చేయించేందుకు బయలుదేరిన కుటుంబాన్ని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృత్యువు కబళించింది. మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి కొద్దిసేపట్లో చేరుతారగా లారీ రూపంలో మృత్యువు ముంచుకొచ్చింది. కారును ఢీకొట్టిన ప్రమాదంలో తాత, నాయనమ్మతో సహా 21 రోజుల పసికందు అక్కడికక్కడే చనిపోతే, ఐదేళ్ల సోదరి తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం ఆ కుటుంబంలోనే కాక తెనాలిలోనూ తీర్చలేని పెను విషాదాన్ని నింపింది. తెనాలి చెంచుపేటకు చెందిన గిడుగు రవీంద్రమోహనబాబుకు ఇద్దరు సంతానం. వారిలో కొడుకు కుటుంబంతో కలిసి అందరూ సోమవారం కృష్ణా జిల్లా మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి తెనాలి నుంచి బయలుదేరి వెళ్లారు. వెళ్లిన గంటలోనే పెను విషాదకరమైన వార్త వారి బంధువులను శోక సంద్రంలో ముంచింది. రవీంద్ర మోహనబాబు (55) తెనాలిలో ఎలక్ట్రికల్ కాంట్రాక్టరుగా పని చేస్తున్నారు. ఆయన గోదావరి జిల్లాకు చెందిన అరుణను (52) కులాంతర వివాహం చేసుకున్నారు. వారికి సందీప్ అనే కుమారుడు, మరొక కుమార్తె ఉంటే కుమారుడు గుంటూరులోని ఐటీసీలో ఉద్యోగిగా ఉన్నారు. ఈయన కూడా తెనాలికి చెందిన పల్లవి అనే ఆమెను కులాంతర వివాహమే చేసుకున్నాడు. వీరికి సాత్విక (5), అనే చిన్నారి ఉంటే వారి పెళ్ళి తరువాత చాలా కాలానికి ఒక కుమారు డు జన్మించాడు. 21 రోజుల క్రితం పుట్టిన మనువడిని చూసి మురిసిపోయిన ఆ కుటుంబం సోమవా రం మోపిదేవి వెళ్లి ఆలయంలో నామకరణం చేయించాలని నిర్ణయించుకుని కారులో బయలుదేరారు.

పులిగడ్డ - పెనుమూడి వారధి, టోల్ గేట్ల నడుమ కాకినాడ నుంచి పామాయిల్ లోడుతో ఎదురుగా వస్తున్న లారీని కారు రాంగ్ రూట్‌లో వెళ్లి ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ముందు సీటులో ఉన్న సందీప్ తండ్రి జి.ఆర్.మోహన్‌బాబు, వెనుక కూర్చున్న తల్లి అరుణ అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక సీటులో ఉన్న సందీప్ భార్య పల్లవి, కుమార్తె సాత్విక, తల్లి ఒడిలో ఉన్న షణ్ముఖ్(2 నెలలు), డ్రైవింగ్ సీటులో ఉన్న సందీప్ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని కారుకు ఇరుక్కుపోయిన మోహన్‌బాబు, అరుణ మృతదేహాలను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన సాత్విక, సందీప్, పల్లవిలను అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కారు సీటు వెనుక పసికందు

క్షతగాత్రులందరినీ ఆస్పత్రికి తరలించటం పూర్తయిందని భావించిన పోలీసులు ప్రమాద స్థలం నుంచి కారును వెనక్కి తీయగా, కారులో సీటు వెనుక పడిన రెండు నెలల పసికందు కనిపించింది. వెంటనే అప్రమత్తమైన అవనిగడ్డ సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్ హుటాహుటిన అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి పసికందును తీసుకొచ్చారు. అయితే అప్పటికే ప్రమాదం జరిగి అరగంట కావడంతో పసికందును కాపాడేందుకు వైద్యులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. తీవ్రంగా గాయపడిన స్వాతికకు రెండు సార్లు వైద్యులు సీపీఆర్ చేశారు. అయినా పరిస్థితి విషమంగా ఉండటంతో బెలూన్ ద్వారా ఆక్సిజన్ అందిస్తూ మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే సాత్విక మృతి చెందింది. సందీప్ భార్య పల్లవి తలకు తీవ్ర గాయాలు కావడంతో ఆమెను, కాలు, పక్కటెముకలకు తీవ్ర గాయాలైన సందీప్‌ను కూడా మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నా వాళ్లు ఎక్కడ?

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సందీప్ షాక్‌లోకి వెళ్లిపోయాడు. కొద్దిసేపు తానెవరు, ఎక్కడి నుంచి వస్తుంది కూడా చెప్పలేకపోయిన సందీప్ కొద్దిసేపటి తర్వాత తాము గుంటూరు జిల్లా తెనాలి నుంచి వచ్చినట్లుగా పోలీసులకు తెలిపారు. నాకేమైంది.. ఇక్కడెందుకు ఉన్నాను.. నా వాళ్లు ఎక్కడ అంటూ సందీప్ పోలీసులను ప్రశ్నించారు. దీంతో పోలీసులు, వైద్య సిబ్బంది తల్లిదండ్రులు, కుమార్తె, కుమారుడు మరణించారని సమాధానం చెప్పలేక కంటతడి పెట్టుకున్నారు. సందీప్ ఫోన్‌కు తెలిసిన వారి నుంచి ఫోన్ రావడంతో వారు తెనాలి చెంచుపేటకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వెంటనే వారి బంధువులను అవనిగడ్డ రావాల్సిందిగా సూచించారు. మోహన్‌బాబు, అరుణ, షణ్ముఖ్ మృతదేహాలను అవనిగడ్డ మార్చురీకి తరలించగా, మచిలీపట్నం వెళ్తూ మార్గమధ్యలో మృతి చెందిన సాత్విక మృతదేహాన్ని మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.



రవీంద్రమోహనబాబు, భార్య అరుణ, మనుమరాలు సాత్విక, కుమారుడు సందీప్, కోడలు పల్లవి (ఫైల్‌ఫొటో)

చాలా సంవత్సరాల ఎదురు చూపు తరువాత మనువడు జన్మించడంతో కుటుంబమంతా సంతోషంగా ఉన్నారని, నామకరణం చేయించి వద్దామని బయలుదేరితే తిరిగి రాకుండానే మనుమడితో సహా కుటుంబాన్ని ఆ దేవుడు కూడా కరుణించకుండా తీసుకు పోయాడంటూ బంధువులు రోధిస్తున్నారు.

ప్రయాణికులకు మెరుగైన సేవలు

- మంత్రులు సత్యకుమార్, అనగాని.
- రేపల్లె డిపోలో పదిబస్సులు ప్రారంభం

రేపల్లె, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తీరప్రాంతంలో ప్రయాణికుల కష్టాలను తీర్చేందుకు రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి ముందుకు వెళుతున్నారని వైద్యఆరోగ్యశాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం రేపల్లె ఆర్టీసీ డిపోలో పది ఎక్స్‌ప్రెస్ బస్సులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ, నెల్లూరు జోనల్ చైర్మన్ సురేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ తీరప్రాంతంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించే విధంగా ఈ బస్సులు ఉపయోగపడతాయన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రేపల్లె నుంచి తిరుపతికి రెండు బస్సు సర్వీస్‌లను ప్రారంభించామని తెలిపారు. 8 నూతన బస్సులు విజయవాడ,గుంటూరుకు వెళ్ళేవిధంగా ఏర్పాటు చేశామన్నారు. రేపల్లె ప్రజలు ఎన్నో ఏళ్ళుగా ఎదురుచూస్తున్న కోరిక నెరవేరిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రేపల్లె ఆర్టీసీ డిపోకు రెండు ఇంద్ర ఆర్టీసీ బస్సులను కూడా తీసుకువచ్చామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళనారాయణ మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న ఆర్టీసీని అభివృద్ధి వైపు నడిపించేలా కృషిచేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బ్యాటరీ బస్సులను తీసుకురావటం జరుగుతుందన్నారు. రానున్నరోజుల్లో మరిన్ని బస్సులను తీసుకువచ్చి రాష్ట్రంలో ఆర్టీసీని ఉన్నతస్థానంలో నిలబెట్టేందుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సుఖవాసి సునీల్‌కుమార్, కృష్ణాపశ్చిమడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, టీడీపీ రాష్ట్రకార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, మేకా వెంకటశివరామకృష్ణ, జనసేనపార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మత్తి భాస్కరరావు, బీజేపీ నాయకులు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



మంత్రులు అనగాని, సత్యకుమార్ యాదవ్‌లను గజమాలతో సన్మానిస్తున్న ఆర్టీసీ యాజమాన్యం, కార్మికులు

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్టు

తాడేపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న వ్యక్తుల గురించి సమాచారం అందుకున్న తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు సోమవారం ఎయిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లే రోడ్డు వద్ద బ్రహ్మానందపురం పరిధిలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వడ్డేశ్వరం రాధారంగా నగర్‌లో ఉంటున్న ముత్యాల మనోజ్‌కుమార్ అలియాస్ బన్ను, వడ్డేశ్వరంనకు చెందిన షేక్ అమీద్‌బాషా, కొలనుకొండకు చెందిన కైలా ప్రవీణ్‌లను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కల్యాణ్‌రాజు

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 519.70 అడుగులు ఉంది. ఇది 148.72 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7110 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 13,260 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

నాలుగు పళ్ల విభాగంలో జేపంగులూరు ఎడ్లకు ప్రథమస్థానం

తెనాలి అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : తెనాలి మార్కెట్ యార్డులో జరుగుతున్న ఒంగోలు జాతి జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో నాలుగు పళ్ల విభాగంలో బాపట్ల జిల్లా జేపంగులూరుకు చెందిన చిలుకూరి నాగేశ్వరరావు ఎడ్లజత ప్రథమ స్థానంలో నిలిచాయి. 15 నిమిషాల వ్యవధిలో ఈ ఎడ్లు 4260 అడుగుల దూరం బండ లాగాయి. కొల్లిపరకు చెందిన గుదిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్ల జత 4200 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచాయి. సూర్యాపేట జిల్లాకు చెందిన గాదె సుందరమ్మ, పోతూరి ఆదినారాయణ గోపాల్ కంబైన్డ్ ఎడ్ల జత 3851 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం సాధించాయి. కృష్ణా జిల్లా మల్లవల్లికి చెందిన రైతు అక్కినేని శాన్వి చౌదరి ఎడ్లు 3803 అడుగుల దూరం లాగి నాల్గో స్థానం, ప్రత్తిపాడు మండలం కొండెపాడుకు చెందిన రైతు చాగంటి శ్రీనివాసరావు ఎడ్లు 3616 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, మంగళగిరి మండలం నవులూరుకు చెందిన రైతు బత్తుల శ్రీనివాసరావు ఎడ్లు 3409 అడుగుల దూరం లాగి ఆరో స్థానం, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడుకు చెందిన రైతు గోపినాయుడు, సాంబశివరావుల కంబైన్డ్ ఎడ్లజత 3404 అడుగుల దూరం లాగి ఏడో స్థానం, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడుకు చెందిన రైతు దర్శి సాత్విక్ ఎడ్లు 3075 అడుగుల దూరం లాగి ఎనిదో స్థానం, పల్నాడు జిల్లా కేసానుపల్లికి చెందిన రైతు శ్రీకావ్య రామకోటయ్య కంబైన్డ్ ఎడ్ల జత 3060 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. ఈ విభాగంలో మొత్తం 15 జతలు పోటీ పడ్డాయి. విజేతలకు (వరుసగా ప్రథమ నుంచి తొమ్మిదో స్థానం వరకు) దాతలు కావూరి కృష్ణమోహన్ రూ.40 వేలు, కొత్తమాసు కుమార్ రూ.30 వేలు, కొత్తపల్లి రవీంద్రబాబు రూ.25 వేలు, కొల్లి నాగఫణీంద్రరెడ్డి రూ.20 వేలు, గోగినేని కృష్ణచైతన్య రూ.15 వేలు, సురేంద్రరాజు రూ.12 వేలు, వాసుదేవరావు రూ.10 వేలు, అబ్దుల్ రహీమ్ రూ.8 వేలు, కొడాలి ప్రభాకర్ రూ.6 వేలు అందించారు. పోటీల్లో పాల్గొన్న మిగిలిన జతలకు ప్రోత్సాహక నగదు బహుమతిగా రూ.5 వేలు అందజేశారు. ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, టీడీపీ నాయకులు పోటీలను పర్యవేక్షించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన జేపంగులూరు ఎడ్లజత



నాలుగు పళ్ల విభాగంలో పోటీపడుతున్న ప్రత్తిపాడు మండలం కొండెపాడుకు చెందిన రైతు చాగంటి శ్రీనివాసరావు ఎడ్ల జత

వృషనాళాల్లో దిగిన ఆటో హ్యాండిల్

- ఆపరేషన్ చేసి తొలగించిన తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు



తెనాలి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆటో హ్యాండిల్ వృషనాళాల్లోకి దిగి ప్రమాదకరంగా ఉన్న వ్యక్తికి తెనాలి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు జనరల్ అనస్థీషియాలో శస్త్రచికిత్స చేసి నిండుప్రాణాన్ని కాపాడారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం తెనాలి సుల్తానాబాద్‌కు చెందిన ఆటో డ్రైవర్ టమ్మిశెట్టి దుర్గావర ప్రసాద్ (26) ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం తెనాలి నుంచి నందివెలుగు వెళుతూ ఎదురుగా ఉన్న వాహనాన్ని ఢీ కొట్టడంతో ఆటో హ్యాండిల్ రాడ్ అతడి వృష నాళాల నుంచి తొడ నరాల మధ్య గజ్జలోకి దిగింది. స్థానికులు హ్యాండిల్‌ను ఆటో నుంచి తొలగించి క్షతగాత్రుడిని తెనాలి ప్రభుత్వ వైద్యశాల అత్యవసర విభాగానికి తీసుకువచ్చారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా రోగిని ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ హనుమంతరరావు, వెంకటేశ్వరరావు, అనస్థీషియా డాక్టర్ యశస్వి, డాక్టర్ తులసి నేతృత్వంలో వైద్యబృందం పరీక్షలు నిర్వహించి అనస్థీషియా ద్వారా శస్త్రచికిత్స చేసి హ్యాండిల్‌ను తొలగించారు.

ఆటో అదుపుతప్పి డ్రైవర్ మృతి



మల్లిరాజు (ఫైల్)

మాచర్ల రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లడంతో ఆటో డ్రైవర్ మృతిచెందిన సంఘటన మండలంలోని అలుగు రాజుపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని టీకేపీ చెంచుకాలనీకి చెందిన పోగుల పెద్ద మల్లిరాజు (35) ముఠా కూలీలను తీసుకొచ్చేందుకు తాటి అంజి అనే వ్యక్తితో కలిసి ఆటోలో అలుగురాజుపల్లి బయలుదేరాడు. అలుగురాజుపల్లి లోని డొంక రోడ్డులో వెళ్తుండగా ఆటో అదుపుతప్పి ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ సంఘటనలో మల్లిరాజు కిందపడడంతో తలకు రాయి బలంగా తగిలి తీవ్ర గాయంతో అక్కడికక్కడే మృతిచెందగా అంజి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహ్మద్ షఫి సంఘటనా ప్రాంతానికి చేరుకుని మల్లిరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు భార్యలు, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

వీఆర్వో కోటయ్య మృతదేహం లభ్యం



ఆవుల కోటయ్య (ఫైల్)

పిడుగురాళ్ల, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లి మండలం రేమిడిచర్ల వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న ఆవుల కోటయ్య (50) మృతదేహాన్ని సోమ వారం పిడుగురాళ్ల సమీపంలోని జూలకల్లు లాకుల వద్ద పిడుగురాళ్ల పోలీసు లు గుర్తించారు. మృతుడు మార్చి 29న రేమిడిచర్ల నుంచి చిలకలూరిపేటలో నివాసముంటున్న చిన్న కొడుకు వద్దకు వెళ్లి వస్తానని చెప్పి అక్కడికి వెళ్ల కుండా కారంపూడి సమీపంలోని జూలకల్లు వద్ద వున్న సాగర్ కాలువ బ్రిడ్జిపై నిలబడి వీడియో కాల్ చేసి చనిపోతున్నట్లు మనవరాలికి చెప్పడంతో కుటుం బ సభ్యులు కారంపూడి నుంచి నాగార్జునసాగర్ కాల్వ వెంట వెతుకుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మనవరాలికి వీఆర్వో కోటయ్య వీడియో కాల్‌లో తనకు అప్పుల సమస్య వున్నట్లు చెప్పడంతో పాటు మృతుడు భార్య గాలమ్మ సోమవారం పిడుగురాళ్ల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో అప్పుల బాధ వున్నట్లు తెలిపింది. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో జూలకల్లు లాకుల వద్ద కోటయ్య మృతదేహం కుటుంబసభ్యులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మోహన్ తెలిపారు.

బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో ఒకరు గల్లంతు

నకరికల్లు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో ఈతకు దిగి ఒకరు గల్లంతైన సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజుపాలెం మండలం పెద నెమలిపురి గ్రామానికి చెందిన ఐదుగురు స్నేహితులు ఈత కొట్టేందుకు శ్రీరాంపురం వద్ద గల బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌లో దిగారు. చిట్యాల హర్షతుల్లా(21)కి ఈత రాక పోవటంతో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో నీటిలో మునిగి కాలువలో కొట్టుకు పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు హర్షతుల్లా ఆచూకీ కోసం కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. హర్షతుల్లా ఆచూకీ లభించ లేదు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	145, 154, 165
చికెన్ విత్ స్కిన్(కిలో)	280.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	290.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



పూజలో పాల్గొన్న హైకోర్టు జడ్జి దుప్పల వెంకటరమణ

వైభవంగా సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



ప్రతిష్ఠించిన సీతారామచంద్రస్వామి విగ్రహాలు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని పట్టాభిపురం వివేకానంద బొమ్మ దగ్గరలోని చంద్రపురంలో శ్రీశ్రీ ముక్తేశ్వర సహిత సీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో సీతా రామచంద్ర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని సోమవా రం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హైకోర్టు జడ్జి జస్టిస్ దుప్పల వెంకటరమణ దంపతులు ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఉదయం 9.29 గంటలకు వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, కార్పొరేటర్ వరప్రసాద్, డాక్టర్ ఓవీ రమణ, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మైనార్టీల అభ్యున్నతి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి

గుంటూరు(తూర్పు), మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే మైనార్టీల సంక్షేమం, అభ్యున్నతి సాధ్యమవు తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాడిశెట్టి మురళి మోహన్ అన్నారు. రంజాన్ పురస్కరించుకుని సోమవారం పలువురు ముస్లిం నాయకులు ఆయన నివాసంలో కలసి శుభాకాంక్షలు తెలిపి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభు త్వం త్వరలో మైనార్టీలకు సబ్సిడీతో కూడిన రుణాలను అందజేస్తున్న ట్టు తెలిపారు. ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖాజావలి మాట్లాడుతూ 1998లోనే చంద్రబాబు ఉర్దూకు రెండో అధి కార భాషగా గుర్తింపు ఇచ్చారని, మైనార్టీల కోసం రోష్ని పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేశారు. కార్యక్రమంలో షేక్ బాజీ, షేక్ షాకీర్, షేక్ యాసీన్, షేక్ బషీర్, షేక్ ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



తాడిశెట్టి మురళీమోహన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మైనార్టీ సంఘ నాయకులు

వైభవంగా ఉగాది పురస్కారాలు

గుంటూరు(తూర్పు), మార్చి 31(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదికపై కళాదర్బార్ ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారాలు వైభవంగా జరిగాయి. కార్యక్రమాన్ని ఆలయ కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరు నాగేశ్వ రరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా టీవీ రంగంలో అనురాధ అయ్యంగారికి, వైద్యరంగంలో డాక్టర్ జీ నాగార్జున, విద్యా రంగంలో కనుమూరి రాజ్యలక్ష్మి, సంగీత రంగంలో శనివారపు శిరీష, వ్యాపార రంగంలో చెన్నుపాటి శివనాగేశ్వరరావు, కళారంగంలో సాయి లక్కరాజు లకు ఉగాది పురస్కారాలు అందించారు. అనంతరం ఏర్పా టు చేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. కార్యక్రమాన్ని కళాదర్బార్ వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు పర్యవేక్షించారు.



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలి

గుంటూరు(తూర్పు), మార్చి 31(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ మృతిపై పారదర్శకంగా దర్యాప్తు చేయాలని ఇద్వా వ్యవస్థాపక అధ్యక్షు డు డాక్టర్ గొళ్లమూడి రాజసుందరంబాబు డిమాండ్ చేశారు. అరం డల్‌పేట ఓ హోటల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావే శంలో ఆయన మాట్లాడారు. కేసును పక్కదారి పట్టించేందుకు కొంత మంది కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పాస్టర్ ప్రవీణ్ ప్రతిష్ఠను దిగజార్చేందుకు సోషల్ మీడియాలో వీడియోలు పెట్టి పైశాచిక ఆనం దం పొందుతున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దళిత క్రిస్టియన్ వాచ్ అధ్యక్షురాలు గద్దె రత్నశ్రీ మాట్లాడుతూ ప్రవీణ్ మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట సంతకాల సేకరణ, అనంతరం కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ముద్దు ప్రేమ జ్యోతి బాబు, కారంశెట్టి గోపి, చుక్క దేవరాజు, నల్లపు నీలాంబరం, జయ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజసుందరంబాబు, పాల్గొన్న దళిత సంఘ నాయకులు రత్నశ్రీ తదితరులు

కేజీ మటన్ రూ.1000

● చికెన్ రూ. 280 ● ఉగాది, రంజాన్ పండగలతో పెరిగిన ధరలు

గుంటూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఉగాది, రంజాన్ పండగలు వరుసగా రావడంతో జిల్లా వ్యాప్తంగా మటన్, చికెన్ విక్రయాలకు గిరాకీ పెరిగింది. ఆదివారం పలు స్టాల్స్‌లో మటన్ కేజీ ధర రూ.1000కి నిర్వాహకులు పెంచారు. అలానే చికెన్ రూ.280కి విక్రయించారు. రంజాన్ పండగ రోజున ముస్లింలు ఎక్కువగా మటన్ వంటకాలకే ఇష్టపడు తుంటారు. దీనిని అవకాశంగా చేసుకొన్న వ్యాపారస్థులు మటన్ రూ. వెయ్యి అంటూ బోర్డులు పెట్టేశారు. అయినప్పటికీ ఎవరూ వెనక్కు తగ్గలేదు. మధ్యాహ్నానికే స్టాల్స్ అన్నింటిలో మటన్ విక్రయాలు జరిగిపోయాయి. అలానే తలకాయ, కాళ్లు వంటివి కూడా భారీగానే విక్రయం జరిగాయి. నిన్నమొన్నటి వరకు వైరస్ సోకి కోళ్లు మృత్యువాత పడటంతో కేజీ చికెన్ రూ.100కి విక్రయించినా వాటి వైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. ఇప్పుడు ఆ భయం తొలగిపోవడంతో ఇదే అదనుగా స్టాల్స్ నిర్వాహకులు ఈ సోమవారం కేజీ చికెన్ రూ.280 బోర్డులు ఏర్పాటు చేసి విక్రయించారు. రంజాన్ పండగ రోజున ముస్లింలు వారి ఇంటి వరకే కాకుండా బంధువులు, స్నేహితులకు వంటకాలు తయారు చేసి పంపిస్తుంటారు. అలానే ఇళ్లకు ఆహ్వానించి వడ్డిస్తుంటారు. ఇది కూడా మటన్, చికెన్ ధరలు పెరగడానికి కారణమైంది.

ఆయుష్ మిషన్‌ను నిర్వీర్యం చేసిన వైసీపీ

● రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ తదితరులు

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కేంద్రం జాతీయ ఆయుష్ మిషన్ కింద కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేస్తే గత వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కి సర్వనాశనం చేసిందని రాష్ట్ర ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. గుంటూరు రూరల్ పరిధి, పొత్తూరు గ్రామంలో ఉన్న స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు జరి గాయి. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎమ్మెల్యేలు రామాంజనే యులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బీజేపీ నాయకులు వల్లూరు జయప్రకాశ్ నారాయణతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్రం 2014లో ఆయుష్‌కు ప్రత్యేక మంత్రిని నియమిస్తే 2019 తర్వాత ఏపీలో ఆయుష్ సంస్థను ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసి నిధులు మురిగి పోయేలా చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. వికసిత భారత్ పేరుతో మోదీ చిత్తశుద్ధితో ఉంటే ఏపీ అభివృద్ధే ధ్యేయంగా విజనరీ లీడర్ చంద్రబాబునాయుడు ఉండ టం గర్వంగా ఉందని అన్నారు. ఆయుర్వేదం అంటే మనకి కేరళ గుర్తుకు వస్తుంది కానీ నేడు మన దగ్గర కూడా అద్భుతమైన చికిత్సలు అందించడం గర్వకారణమని అన్నారు. ఆయుర్వేద ఆస్పత్రుల్లో ఉన్న ఖాళీ ఉద్యోగాలపై దృష్టి సారించి చర్యలు చేపట్టామని అన్నా రు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులుగా డా. కే ఎస్ఆర్ గోపాలన్ ఆరోగ్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఆల్కహాల్ డీఎడిక్షన్ సెంటర్ కూడా ప్రారంభించి ఆయుర్వేద వైద్యం ద్వారా మద్యం బారిన పడిన బాధితులను కాపాడాలని కోరారు. కార్య క్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చైతన్య, వైద్యులు ప్రేమానంద్, విజయ భాస్కర్, సాయి సుధాకర్, మన్నవ రాధాకృష్ణమూర్తి, హిమసాగర చంద్రమూర్తి, కేఎస్ఆర్ కుటుంబరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు, కొర్రపాటి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వల్లూరి శివప్రసాదు, పాల్గొన్న ప్రొఫెసర్ సుశీలమ్మ తదితరులు

గ్రంథాలయాలు పునర్వికాసం పొందాలి

● పునర్వికాస ఉద్యమ కన్వీనర్ వల్లూరి శివ ప్రసాదు

గుంటూరు(తూర్పు), మార్చి 31(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు పునర్వి కాసం పొందాలని పునర్వికాస ఉద్యమ కన్వీనర్ వల్లూరి శివ ప్రసాదు అన్నారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్, సీనియర్ సిటిజన్స్ సమావేశ మంది రంలో సోమవారం గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ కార్యాచరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశానికి అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి కోసూరి రవికుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వల్లూరి శివప్రసాదు మాట్లాడుతూ గ్రంథాలయా లకు రావాల్సిన పన్నులు గ్రంథాలయాలకే అందేలా గ్రామ, గ్రామాన ఉద్యమం నిర్వహించాలని అన్నారు. ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ మా ట్లాడుతూ పుస్తకాల మధ్య ఎదిగిన తరం రేపటి తరానికి గ్రంథాల యాలను మిగల్చడం కోసం ఈ పునర్వికాస ఉద్యమం అవసరమని అన్నారు. కార్యక్రమంలో కేంద్ర సాహితీ, సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, షేక్ బాబూజీ, శరత్‌చంద్ర, దివి కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కమిటీ ఎన్నిక

గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కమిటీ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. కన్వీనర్‌గా యల్లాప్రగడ మల్లికార్జునరావు, కో కన్వీనర్లుగా సీహెచ్ సుశీలమ్మ, షేక్ బాబుజీతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసనగా ప్రార్థనలు

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లుకు నిరసనగా నల్లరిబ్బన్‌తో మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి సోమవారం నిరసన తెలియజేశారు. రంజాన్ ప్రార్థనల్లో భాగంగా పొన్నూరు రోడ్డులోని ఆంధ్ర ముస్లిం కళాశాల ఆవరణలోని ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి కుడి చేతికి నల్లరిబ్బన్ కట్టుకొని నిరసన తెలియజేస్తూ ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులు అనేవి ఎవరి సొత్తు కాదని ముస్లిం సమాజం కోసం తమ పూర్వీకులు ఇచ్చిన ఆస్తులన్నారు. అటువంటిది వక్ఫ్ సవర ణ బిల్లుతో కేంద్రంలోని బీజేపీ కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టేలా చేసే బీజేపీ కుట్రలను సాగనివ్వమని హెచ్చరించారు. సమాజంలో ప్రజాస్వా మ్యవాదులంతా వక్ఫ్ సవరణ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించాలని కోరారు.



చేతికి నల్లరిబ్బన్‌తో నిరసన తెలియజేస్తూ ప్రార్థనలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి

ఎముకలు, కీళ్ల సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదు

● ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఎముకలు, కీళ్ల సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కొత్తూరు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఎముకలు, కీళ్లకు సంబంధించిన సమస్యలపై ఆదివారం ఆరోగ్య సభ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తూరు మాట్లాడుతూ ఎముకలు ఆరోగ్యంగా ఉండాలంటే తీసుకునే ఆహారంలో క్యాల్షియం ఉండేలా చూసుకోవాలని, ఆహారం ద్వారా తీసుకున్న కాల్షియం శరీరానికి పట్టడానికి విటమిన్-డి3 కూడా చాలా ముఖ్యమన్నారు. తగు పరీక్షలు చేయించుకుని డీ-3 లోపం ఉంటే మందుల రూపంలో తీసుకోవడం మంచిదని సూచించారు. కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స గురించి తెలియజేస్తూ వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి అధునాతన సౌకర్యంతో కూడిన థియేటర్ ఉన్న హాస్పిటల్స్‌లో ఏకకా లంలో రెండు మోకాళ్ళకు ఒకే సమయంలో శస్త్ర చికిత్స చేయించుకోవ చ్చని సూచించారు. ఒకవేళ మోకాళ్ళకు సంబంధించిన సమస్య తొలి దశలో ఉంటే కొన్ని ఇంజక్షన్ల ద్వారా కూడా వైద్యం చేసే అవకాశం ఉందన్నారు. రోజూ వ్యాయామం చేస్తూ కాల్షియం బాగా లభించే పాల ఉత్పత్తులు, నువ్వులు, పాలకూర లాంటి వాటిని ఆహారంలో ఉండే విధంగా చూసుకుంటూ డి-3 విటమిన్ లభించే విధంగా కొంత సమయమైనా ఎండ తగిలే విధంగా నడక అలవాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్ కొత్తూరు రాజశేఖర్ రెడ్డిను ఘనంగా సత్కరించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, కార్యక్రమం కో ఆర్డినేటర్ టీవీ సాయిరాం, సేతు రామేశ్వరరావు, విశ్రాంత అధ్యాపకుడు ఆర్.రామచంద్రరావు ప్రసంగించారు.

10న ఒంటిమిట్ట సీతారాములకు పట్టువస్త్రాలు

మంగళగిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఉన్న సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఏపీ పద్మశాలి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను సమర్పించ నున్నట్టు స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ తెలిపారు. మంగళగిరి స్వర్ణకార సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పద్మశాలీ సేవాసమితి ఆధ్వ ర్యంలో ఈ నెల 10వ తేదీన గరుడసేవలో భాగంగా శ్రీసీతారామస్వాములకు పట్టువస్త్రాలు సమర్పిస్తా మన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని కోరారు.

రూ.152 కోట్లు ఆస్తి పన్ను వసూలు

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవ త్సరానికి రూ. 152 కోట్లు ఆస్తి పన్ను వసూలైందని.. గత ఏడాది కంటే రూ.32 కోట్లు అధికంగా వసూ లైనట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్ను వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం మార్చి 25న ప్రక టించిన 50 శాతం రాయితీని వినియోగించుకొని గుంటూరు నగరంలో చివరి రోజైన సోమవారం రూ.6.10 కోట్లతో కలిపి మొత్తం రూ.26.10 కోట్లు పన్ను నగర ప్రజలు చెల్లిం చారన్నారు. పన్ను వసూళ్లలో కృషి చేసిన అడ్మిన్ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అధి కారులు, డిప్యూటీ కమిషనర్లు ప్రణాళికాబద్ధంగా జరిగేలా పర్యవేక్షణ చేసిన అదనపు కమి షనర్ చల్లా ఓబులేసుకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు.

రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), మార్చి 31(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజ నేయులు అన్నా రు. స్థానిక 41వ డివిజన్, తారాకరామానగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణపనులకు సోమ వారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లా డుతూ రోడ్ల నిర్మాణాల్లో అవకతవకలు జరిగితే సహించేదిలేదని స్పష్టం చేశారు. అవసరమైతే సదరు కాంట్రాక్టరును బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పీ-4 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. మంగళవారం జరిగే పెన్షన్ల పంపిణీలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ అధికారులు పాల్గొని సకాలంలో కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్మిత పద్మజ, గింజుపల్లి వెంకటేశ్వరరావు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

5న జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష

గుంటూరు(తూర్పు), మార్చి 31(ఆంధ్రజ్యోతి): భారత న్యాయవాదు ల సంఘం(ఐఏఎల్) ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న జిల్లా కోర్టు ప్రాంగణం లో జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు సంఘ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు జే.నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. హాజరైన అభ్యర్థులకు సర్టిఫికెట్, పరీక్షలో తొలి మూడు స్థానాల్లో నిలి చిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్టు పేర్కొన్నా రు. వివరాలకు 9491945025, 9441504506 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం అందించాలి

● నాసా మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు

గుంటూరు(తూర్పు), మార్చి 31(ఆంధ్రజ్యోతి): పేద, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు దాతలు, ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని నాసా మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు అన్నారు. స్థానిక విద్యా నగర్, వీవీవీ హెల్త్ హబ్‌లో గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకుని పలు క్రీడల్లో రా ణించిన 60మందికి ఉగాది క్రీడా పురస్కారాలను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిం చిన క్రీడాకారులకు గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఉగాది క్రీడా పురస్కారాలు అందజేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు, ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్ర బాబు, ఆంధ్ర క్యారమ్ సంఘం కార్యద ర్శి షేక్ అబ్దుల్ జలీల్, కేఎల్‌యూ యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ హరికృష్ణ, అథ్లెటిక్స్ కోచ్ సుబ్బారావు, అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ జిల్లా చైర్మన్ జీశేషయ్య పాల్గొని క్రీడాకారులకు, కోచ్‌లకు పురస్కారాలను అందజేశారు.



పురస్కార గ్రహీతలతో చందు సాంబశివరావు, స్పోర్ట్స్ ఫౌండేషన్ సభ్యులు



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, చిత్రంలో ఎమ్మెల్యే నసీర్

తూర్పు ఎమ్మెల్యే కార్యాలయం ప్రారంభం

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండేలా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయాన్ని రంజాన్ పర్వదినాన ప్రారం భించడం అభినందనీయమ ని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదురుగా సిద్ధం చేసిన కార్యాలయాన్ని సోమవారం ఆయన ఎమ్మెల్యే నసీర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు తమ కార్యాలయం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. రంజాన్ పర్వదినం రోజు న తమ కార్యాలయం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఏ చిన్న సమ స్య వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్య కర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై ఎమ్మెల్యే నసీర్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం, లోకేశ్‌లపై అంబటి విమర్శలు తగదు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రారంభించిన పీ-4 కార్యక్ర మంపై మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై అంబటి రాంబాబు విమర్శలు చేయ డాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివా సరావు తప్పుపట్టారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి నోరు అదుపులో పెట్టుకోపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పీ-4 గురించి అర్థమయ్యే శక్తి సామర్థ్యాలు అంబటికి లేవని అన్నారు. ముఖ్యమంత్రి హోదాలో తాడేపల్లి ప్యాలెస్‌లో ఉగాది సందర్భంగా దేవుడు సెట్టింగ్ వేసి కృత్రిమ పూజలు నిర్వహిం చిన జగన్, ఈ ఉగాదికి బెంగళూరు ప్యాలెస్‌లో ఎందుకు సేద తీరాడో ప్రజలకు అంబటి సమాధానం చెప్పాలన్నారు. కూటమిలో ఎవరు సీఎం అవ్వాలో చెప్పే అర్హత అంబటికి లేదన్నారు. అంబటి ఇలానే నోరు పారేసుకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదని కనపర్తి హెచ్చరించారు.

అంతరాయాల సమస్యలను పరిష్కరిస్తాం

● బీఎస్ఎన్ఎల్ టిప్ ఆపరేటర్లకు పెమ్మసాని భరోసా

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): బీఎస్ఎన్ఎల్ సేవల్లో తరచూ తలె త్తుతున్న అంతరాయాలను, ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించి టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్ల(టిప్)కు సమస్య లేకుండా పరిష్కరిస్తానని కమ్యూని కేషన్‌శాఖ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ భరోసా ఇచ్చారు. గుంటూరులోని మంత్రి కార్యాలయంలో సోమవారం ఆయనను కలిసి టిప్ ఆపరేటర్లు బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్, బిల్ పేమెంట్ల సమస్యలను వివరించారు. గుంటూరు జిల్లాలో ప్రస్తుతం లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, పని చేస్తున్న ఆపరేటర్లను కాదని, కొత్తగా ఆపరేటర్లను ఏర్పాటు చేసిన గుంటూరు జిల్లా ఉన్నతాధికారిపై ఈ సందర్భంగా ఆపరేటర్లు ఫిర్యాదు చేశారు. తక్షణమే మంత్రి పెమ్మసాని బీఎస్ఎన్ఎల్ సీజీఎం శేషాచలంతో ఫోన్లో మాట్లాడారు. సజావుగా పనిచేసే ఆపరేటర్లను ఇబ్బంది పెడితే ఊరుకోబోమని, న్యాయబ ద్ధంగా వాళ్లకి అందించాల్సిన సౌకర్యాలను వెంటనే ఏర్పాటు చేయాలని, బిల్లు లు చెల్లింపుల విషయంలో పారదర్శకంగా ఉండాలని సూచించారు. స్పీడ్ సమ స్యను కూడా వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. టిప్ స్టేట్ ప్రెసిడెంట్ సోమశేఖర్, జనరల్ సెక్రటరీ సీహెచ్ ప్రవీణ్, ట్రెజరర్ వైవీ రావు పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే గళ్లా మాధవి రంజాన్ శుభాకాంక్షలు

గుంటూరు, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పర్వదినం పురస్కరించుకొని పలువురు ముస్లింలు జీటీ రోడ్డులోని కార్యాలయంలో పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె ముస్లింలకు మిఠాయిలు అందజేసి ఈద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ రంజాన్ అంటేనే పరోపకార గుణం, సహనం, త్యాగం, కరుణ, సానుభూతి భావాలను పెంపొందిస్తుందన్నారు. ప్రజలంతా మత సామరస్యంతో, సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



ఎమ్మెల్యే మాధవికి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న ముస్లింలు

పేదరికం లేని రాష్ట్రం కోసం పీ-4

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్‌కుమార్

గుంటూరు సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేపట్టిన పీ-4 కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వా హక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్ తెలిపారు. సోమవారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ దీనివల్ల పేదరికంలో ఉన్న అన్ని వర్గాలకు మేలు జరుగు తుందన్నారు. ఉన్నత స్థితిలో ఉన్నవారు పేదరికం లో ఉన్నవారికి సహాయపడే విధంగా ఈ పథకాన్ని రూపొందించారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టడం హర్షణీయం అన్నారు. పేదరిక నిర్మూలనకు చేపట్టిన పీ-4 ద్వారా ఎంతోమందికి లబ్ధి చేకూరుతుందన్నారు. దీనిని అందరూ ఉపయోగించుకోవా లని ఆయన కోరారు. పేదలకు ఇదివరం లాంటిదని సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

బిక్షమెత్తుతున్న బాల్యం

ఒక్కోసారి రోడ్డు మీద కనపడే దృశ్యాలు చూస్తూ ఉంటే ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న వేల కోట్ల సంక్షేమం ఏమౌతుంది అన్న అనుమానం ఉద్భవిస్తుంది. గుంటూరులోని ప్రధాన కూడళ్లలో పిల్లలు చేత భిక్షాటన చేయించటం తరచుగా కనిపిస్తుంది. తల్లి ఒడిలో.. బడిలో ఉండాల్సిన చిన్నారులను ఇలా రోడ్డు మీద ఉంచి చేయి చాపేలా చేస్తున్నారు. దాని వెనుక దాగిన వాస్తవాలు కోసేపు పక్కన పెడితే అధికారులు ఏమి చేస్తున్నారన్న ప్రశ్న ఉద్భవిస్తుంది. అటువంటి బాలల కోసం ఏర్పాటు చేసిన ఆవాస కేంద్రాలు ఎన్నో వున్నా యంత్రాంగం దృష్టి సారించకపోవటం దురదృష్టకరం.

- గుంటూరు (ఆంధ్రజ్యోతి)







ఇది.. నారా వారి ఊరు

సీఎం సొంతూరులో సర్వతోముఖాభివృద్ధి

జడ్పీ హైస్కూలులో ఐఐటీ మద్రాసు పాఠాలు

యువతకు నైపుణ్య శిక్షణ

ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెల్

గడప గడపకూ తాగునీరు, వంట గ్యాస్

(తిరుపతి - ఆంధ్రజ్యోతి)

శేషాచల పర్వతాల పాద భాగంలో పచ్చటి పంటపొలాలు, అడవుల నడుమ ఆవిర్భవించిన నారావారిపల్లె ఒక చిన్న పల్లెటూరు..! తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కందులవారిపల్లె పంచాయతీలో ఓ మజరా గ్రామం. చంద్రబాబు గతంలో 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న సమయంలో టీటీడీ కల్యాణ మండపం, కమ్యూనిటీ ఆస్పత్రి ఏర్పాటు చేయించారు. గతేడాది నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టాక నారావారిపల్లె అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించడంతో తిరుపతి కలెక్టర్ రంగంలోకి దిగారు. ఇంటింటి సర్వే చేపట్టి కుటుంబాల సమగ్ర వివరాలు సేకరించి ఆ సమాచారం సీఎం ముందుంచారు. ఆయన సూచనలతో స్వర్ణ నారావారిపల్లె పేరిట సమగ్ర ప్రణాళిక రూపుదిద్దుకుంది. అందులో భాగంగా చంద్రగిరి మండలం కందులవారిపల్లె, ఎరంగంపేట, చిన్నరామాపురం పంచాయతీల పరిధిలోని 31 మజరా గ్రామాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. క్లస్టర్ పరిధిలో 2,007 ఇళ్లలో.. 2,160 కుటుంబాలకు చెందిన 5,960 మంది జనాభా ఉన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు కుటుంబాల అవసరాలు తీర్చేందుకూ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. ఈ 2,160 కుటుంబాల్లో 1,830 కుటుంబాలకు సొంత ఇళ్లున్నాయి. 286 కుటుంబాలకు లేవని గుర్తించగా నిబంధనల రీత్యా అర్హత కలిగిన 242 కుటుంబాలకు పీఎంఏవై కింద పక్కా గృహాలు మంజూరు చేయనున్నారు. వచ్చే ఏడాది మార్చిలోగా పక్కా ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసి అప్పగిస్తారు. వ్యక్తిగత మరుగుదొడ్ల సదుపాయం లేని 35 కుటుంబాలకు కొద్ది రోజుల్లో వాటిని నిర్మించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. క్లస్టర్ పరిధిలో 1,202 మందికి వివిధ రకాల పెన్షన్లు అందుతున్నాయి. 137 మంది అర్హులకు మంజూరు కాలేదని గుర్తించారు. 97 మందికి గత నెలలోనే పెన్షన్లు మంజూరు చేశారు. మిగిలిన వారికీ త్వరలో ఇచ్చే ఏర్పాట్లు పూర్తయ్యాయి. క్లస్టర్ పరిధిలో 87 కుటుంబాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లు లేవని సర్వేలో గుర్తించారు. వాటిలో ఇప్పటికే 20 కుటుంబాలకు కనెక్షన్లు ఇవ్వగా.. మిగిలిన వారికి సెప్టెంబరులోపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే 286 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్లు లేవని తేలగా వారందరికీ వంట గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేశారు.

యువతకు ఉపాధి కోసం శిక్షణ







ఇంటింటి సర్వేలో భాగంగా యువత ఏ రంగంలో శిక్షణ కావాలని కోరుకుంటున్నారో గుర్తించి.. వారికి శిక్షణ కల్పిస్తున్నారు. దానికోసం నారావారిపల్లెలో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఈ గ్రామాల పరిధిలోని 35 మంది మహిళలకు జ్యూట్ బ్యాగ్, ఎంబ్రాయిడరీలలో శిక్షణ ఇచ్చారు. తిరుపతికి చెందిన నారీ ఎన్జీవోతో ఒప్పందం కుదిర్చారు. జూడియో సంస్థ మెటీరియల్ ఇస్తే మహిళలు దుస్తులు, కవర్లు కుట్టిచ్చేలా ఒప్పందం కుదిరింది. మరో 33 మంది యువతీయువకులకు డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. 449 మంది సభ్యులున్న 45 మహిళా సంఘాలకు గత మూడు నెలల్లోనే రూ.6.50 కోట్ల రుణాలు మంజూరు చేశారు. ఆ రుణాల ద్వారా 15 మంది మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలు అందజేశారు. వాటికి అవసరమైన రీఛార్జింగ్ స్టేషన్ కూడా నారావారిపల్లెలో ఏర్పాటు చేస్తున్నారు. క్లస్టర్ పరిధిలోని 7 దుకాణాలకు ఈజీమార్ట్‌తో ఒప్పందం కుదిర్చారు. దుకాణదారులు సరుకుల కోసం తిరుపతికి రాకుండా ఈజీమార్ట్ ద్వారా సరుకులు నేరుగా దుకాణాలకు చేరుతున్నాయి.



స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ ద్వారా శిక్షణ పొందుతున్న మహిళలు

ప్రతి ఎకరం బిందు సేద్యం పరిధిలోకి..

300 మంది రైతులు 1,104 ఎకరాలు సాగు చేస్తున్నారు. అందులో అత్యధికంగా మామిడి పంట ఉంది. ఈ మొత్తం వ్యవసాయ భూమిని డ్రిప్ ఇరిగేషన్ పరిధిలోకి తేవాలని సీఎం ఆదేశించారు. ఈ 3నెలల్లోనే 21 మందికి చెందిన 43.5 ఎకరాలకు డ్రిప్ సదుపాయం కల్పించారు. పంటలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించే ఉద్దేశంతో ఫార్మర్స్ ప్రొడ్యూజ్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. ఇప్పటికే అందులో 250 మంది రైతులు చేరారు. వీరి ఉత్పత్తుల కోసం ఇప్పటి వరకూ దేశంలో పెద్దగా అమలులో లేని ట్రేసబిలిటీ క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. పాడి ఆవుల రక్షణ కోసం గోకులాల పేరిట రూ.2.02 కోట్ల నిధులతో 103 షెడ్లు మంజూరు కాగా.. 87 షెడ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలినవి కొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయి. నారావారిపల్లి క్లస్టర్‌లో రోజువారీ పాల ఉత్పత్తి 5,800 లీటర్లు.

రూ. 155 కోట్లతో అభివృద్ధి పనులు

నారావారిపల్లె క్లస్టర్‌లో రూ.155 కోట్లతో అభివృద్ధి పనులు ప్రతిపాదించగా వాటిలో కొన్ని మంజూరయ్యాయి. ఎరంగంపేట నుంచి నారావారిపల్లె మీదుగా భీమవరం ఆర్‌అండ్‌బీ రోడ్డు మరమ్మతులకు రూ.16 కోట్లు మంజూరయ్యాయి. గ్రామాల్లో రూ.3.14 కోట్లతో 16 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. రూ.6.73 కోట్లతో అవసరమైన చోట్ల డ్రైన్ల నిర్మాణానికి ప్రతిపాదించారు. ఇప్పటికే ఉన్న ఐదు ఓవర్ హెడ్ ట్యాంకుల పునరుద్ధరణకు రూ.25 లక్షలు మంజూరయ్యాయి. క్లస్టర్ పరిధిలోని 31 హ్యాబిటేషన్లకూ తాగునీరు అందించడానికి రూ. 9.30 కోట్లతో తాగునీటి పథకానికి ప్రతిపాదనలు పంపించారు. మరోవైపు రూ.120 కోట్లతో హంద్రీనీవా కాలువ నుంచి కళ్యాణి డ్యామ్‌కు, మూలపల్లి చెరువుకు నీరందించే భారీ పథకాన్ని ప్రతిపాదించారు. ఈ నీటితో నారావారిపల్లె పరిధిలోని మొత్తం 1,104 ఎకరాలకు సాగునీరందించే ప్రయత్నం జరుగుతోంది.



ఈ ఆటోతో రోజుకు వెయ్యి సంపాదిస్తున్నా

స్వర్ణ నారావారిపల్లె క్లస్టర్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఈ ఆటోను ప్రభుత్వం సబ్సిడీతో ఇచ్చింది. రూ.3.50 లక్షల విలువ గల ఈ ఆటో 1.50 లక్షలు రాయితీ ఇచ్చారు. దీంతో రోజుకు వెయ్యి రూపాయలు సంపాదిస్తున్నారు. సీఎం చంద్రబాబు వలన బతుకుతెరువు లభించింది.

- దూపాగు శివ, చిన్నరామాపురం గ్రామం

దేశంలోనే మొదటి కామన్ వర్క్ స్టేషన్: కలెక్టర్ వెంకటేశ్వర్

'నారావారిపల్లె క్లస్టర్‌లో సర్వే సందర్భంగా 48 మంది ఐటీ తదితర ప్రొఫెషనల్స్ వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నారని గుర్తించాం. వీరందరికీ కామన్ వర్కింగ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నాం. ఇళ్ల నుంచి ఆ స్టేషన్‌కు వచ్చి పని చేసుకుని తిరిగి ఇళ్లకు వెళ్లేలా సదుపాయాలు కల్పిస్తాం. ఇంటర్నెట్, ఫర్నిచర్, కంప్యూటర్లు అందుబాటులో పెడతాం. అక్కడే కామన్ స్టడీ సెంటర్ కూడా పెడుతున్నాం. ఈ ప్రాంత ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కాలేజీ నుంచి వచ్చాక కామన్ స్టడీ సెంటర్‌కు వచ్చి చదువుకునేలా లైబ్రరీ సహా అన్ని ఏర్పాట్లు చేస్తాం. దేశంలోనే ఈ తరహా ఏర్పాట్లు నారావారిపల్లెలోనే మొదటగా ఏర్పాటు చేయాలని సీఎం పట్టుదలతో ఉన్నారు.'

స్వర్ణ నారావారిపల్లె సాకారానికి చర్యలు

'స్వర్ణ నారావారిపల్లె సాకారానికి ప్రభుత్వం రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు మంజూరు చేస్తోంది. ప్రతి ఇంటి నుంచీ ఇప్పటికే చెత్త సేకరణ జరుగుతోంది. ఏ ఇంటి చెత్తను ఆ ఇంట్లోనే ఎరువుగా మార్చేలా హోమ్ కంపోస్టింగ్ విధానం ప్రారంభిస్తున్నాం. అవసరమైన నిర్మాణాలను ఉపాధి హామీ నిధులతో చేపడతాం.'

-సుశీలాదేవి, నోడల్ ఆఫీసర్

స్వయం ఉపాధి కల్పన గొప్ప అవకాశం



మహిళలకు స్వయం ఉపాధి కల్పనకు ఉచితంగా టైలరింగ్, మహిళలకు డ్రైవింగ్, ఎంబ్రాయిడరింగ్‌పై శిక్షణ ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే తపన చాలా గొప్ప విషయం.

- మౌనిక, భీమవరం

మా గ్రామాలకు గొప్ప వరం



మా గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం మూడు సచివాలయాల ప్రజలకు గొప్ప వరంగా భావిస్తున్నాం. సీఎం ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందుతామనే నమ్మకం ఉంది.

- కుసుమ, శేషాపురం

కుటుంబ సభ్యుల్లా ప్రోత్సహిస్తున్నారు



ప్రభుత్వ అధికారులు మమ్మల్ని కుటుంబ సభ్యుల్లా ప్రోత్సహిస్తున్నారు. మేం అభివృద్ధి చెందాలని సాయశక్తులా కృషి చేస్తున్నారు. రోజూ మాతో మాట్లాడుతూ మనోధైర్యం ఇస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆశయాలను నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ప్రజలందురూ పాటిస్తే కచ్చితంగా అభివృద్ధి చెందుతాం.

- ప్రశాంతి, నారావారిపల్లె



ప్రతి ఇంటికీ సౌర విద్యుత్

క్లస్టర్ పరిధిలో 2,007 ఇళ్లకు పైకప్పులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయడానికి అవకాశముందని సర్వేలో తేలింది. రూ.12.63 కోట్ల అంచనాతో అన్ని ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే 800 ఇళ్లపై ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. అన్నీ ఏర్పాటు చేస్తే ఏటా రూ.4.86 కోట్ల విలువైన 57.74 లక్షల యూనిట్లు ఉత్పత్తి అవుతుందని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది.

రంగంపేట స్కూలులో మద్రాసు ఐఐటీ పాఠాలు

ఎ.రంగంపేట జిల్లా పరిషత్ హైస్కూలుకు మహర్దశ పడుతోంది. సీఎం ఆసక్తితో ఈ స్కూలును శ్రీసిటీ యాజమాన్యం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద అభివృద్ధి చేసేందుకు ముందుకొచ్చింది. 181 మంది చదువుతున్న ఈ బడిలో కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్, సైన్స్, మ్యాథ్స్, ఇంగ్లీష్ ల్యాబ్‌లు ఏర్పాటు కానున్నాయి. ఫారిన్ లాంగ్వేజెస్ నేర్పించే ప్రతిపాదనలూ ఉన్నాయి. సీఎంవో, శ్రీసిటీల చొరవతో ఇప్పటికే మద్రాసు ఐఐటీ నిపుణులు 3 నెలలుగా ఇక్కడి 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఆన్‌లైన్ పాఠాలు చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచీ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రతిభావంతులను గుర్తించి స్కూల్లో చేర్పిస్తారు. నారావారిపల్లె పరిధిలోని పది ప్రాథమిక పాఠశాలల్లో కూడా మౌలిక వసతులు కల్పించనున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

నా కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు

పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక



'ఎల్2:ఎంపురాన్' చిత్రంలో కొన్ని సన్నివేశాలు వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఇప్పటికే దీనిపై చిత్ర కథానాయకుడు మోహన్‌లాల్ క్షమాపణలు చెప్పారు. తాజాగా చిత్ర దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ తల్లి మల్లిక స్పందించారు. తన కుమారుడు ఎవరినీ మోసం చేయలేదు అని ఆవేదన వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. "ఎల్2:ఎంపురాన్' తెర వెనుక ఏం జరిగిందో నాకు బాగా తెలుసు. పృథ్వీరాజ్ సుకుమారన్‌ను అన్యాయంగా నిందిస్తున్నారు. తప్పుడు కథనాలు రాస్తున్నారు. వాటిని చూసి ఓ తల్లిగా ఆవేదన చెందుతున్నా. మోహన్‌లాల్, చిత్ర నిర్మాతలు ఎవరూ తమను పృథ్వీరాజ్ మోసం చేశాడని చెప్పలేదు. ఇప్పుడు ఆయనకు, నిర్మాతలకు తెలియకుండా కొందరు నా కుమారుడిని బలిపశువును చేయడానికి ప్రయత్నిస్తున్నారు. అందరి ఆమోదంతోనే చిత్రం తెరకెక్కింది. కానీ సినిమా విడుదలయ్యాక పృథ్వీరాజ్ మాత్రమే జవాబుదారీ ఎలా అవుతాడు' అని ప్రశ్నించారు.

శ్రీరామ నవమి కానుకగా



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పెద్ది'. జాన్వీ కపూర్ కథానాయిక. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ నిర్మిస్తున్నాయి. ఇప్పటికే ఈ మూవీ నుంచి ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేసిన చిత్రబృందం తాజాగా గ్లింప్స్ రిలీజ్ డేట్‌పై అప్డేట్ ఇచ్చింది. శ్రీరామ నవమి కానుకగా ఫస్ట్ గ్లింప్స్‌ని ఈనెల 6న విడుదల చేస్తున్నట్లు దర్శకుడు బుచ్చిబాబు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. కన్నడ నటుడు శివరాజ్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

అమ్మలందరికీ అంకితం

కల్యాణ్‌రామ్



నరసరావుపేట పట్టణంలోని రవికళా మందిర్ థియేటర్‌లో సోమవారం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' చిత్రం నుంచి 'నాయాల్ది' అనే తొలిపాట విడుదల చేశారు. నందమూరి కళ్యాణ్‌రామ్, విజయశాంతి ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ కార్యక్రమంలో నందమూరి కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ ఈ చిత్రాన్ని అమ్మలకు అంకితం చేస్తున్నామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం పడుకునే వరకు మన గురించి ఆలోచించే అమ్మలకు ఇచ్చే గౌరవంగా భావిస్తున్నామన్నారు. రాబోయే 20 సంవత్సరాల వరకు ఈ చిత్రం గుర్తుండిపోతుందన్నారు. దర్శకుడు చిలుకూరి ప్రదీప్ మాట్లాడుతూ ప్రేక్షకుల భావోద్వేగాలకు అనుగుణంగా తీర్చిదిద్దామన్నారు. చిత్రంలో పల్నాడు పౌరుషం కనిపిస్తుందని చెప్పారు. నందమూరి కళ్యాణ్‌రామ్‌కు స్థానిక ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య కోటప్పకొండ త్రికోటేశ్వరుని చిత్ర పటం అందజేశారు. కార్యక్రమంలో నిర్మాత అశోక్‌వర్ధన్ ముప్పా తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట టౌన్ (ఆంధ్రజ్యోతి)



పూరి మార్క్‌తో

విభిన్నమైన.. విలక్షణమైన పాత్రలతో జాతీయ స్థాయిలో నటుడిగా మంచి పేరు తెచ్చుకున్నారు విజయ్ సేతుపతి. కొత్తదనం నిండిన కథలతో అలరించే దర్శకుడు పూరి జగన్నాథ్. ఇప్పుడు వీరిద్దరి కలయికలో ఓ చిత్రం రాబోతోంది. చిత్రబృందం ఈ విషయాన్ని ప్రకటించింది. 'ఈ సినిమా కోసం పూరి జగన్నాథ్ పవర్‌ఫుల్ కథను రాశారు. ఆయన తనదైన శైలిలో తెరకెక్కించనున్నారు. నటుడిగా విజయ్ సేతుపతిలోని కొత్త కోణాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. జూన్‌లో చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని యూనిట్ తెలిపింది. చార్మీ కౌర్‌తో కలసి పూరి జగన్నాథ్ నిర్మిస్తున్నారు.

ఈ స్థాయి విజయం ఊహించలేదు

కల్యాణ్ శంకర్



తన తొలి చిత్రం 'మ్యాడ్'తో దర్శకుడిగా సూపర్‌హిట్ అందుకున్నారు కల్యాణ్ శంకర్. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'మ్యాడ్ స్క్వేర్'ను నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకాదరణతో భారీ హిట్ దిశగా దూసుకుపోతోంది. ఈ సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు కల్యాణ్. "మొదటి భాగం యువతకు ఎక్కువ చేరువైంది. కానీ రెండో భాగం యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులకూ చేరువవ్వడం ఆనందంగా ఉంది. సినిమాకు మంచి స్పందన వస్తుందని ఊహించాం. కానీ, ఈ స్థాయి విజయం అందుకుంటుందని అస్సలు ఊహించలేదు. ఈ సినిమాలో కథ ఉండదు.. కేవలం వినోదం మాత్రమే ఉంటుంది అని ప్రేక్షకులను ముందుగానే సిద్ధం చేయడం కలిసొచ్చింది. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్‌నితిన్, విష్ణుల నటన, వినోదం, భీమ్స్ సిసిరోలియో సంగీతం, నిర్మాణ విలువలు ఈ సినిమాకు ప్రధానాకర్షణగా నిలిచాయి. ఈ విజయం ప్రేక్షకుల ప్రేమాభిమానాలకు అంకితం" అని చెప్పారు.

ఉత్కంఠభరితంగా సాగే...



'అక్కడొకడుంటాడు' ఫేమ్ శివ కంఠంనేని, ఎస్తర్, ధన్య బాలకృష్ణన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న హారర్ థ్రిల్లర్ 'అమరావతికి ఆహ్వానం'. జీ.వి.కె దర్శకత్వంలో కె.ఎస్.శంకర్ రావు, ఆర్.వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా దర్శకుడు జీ.వి.కె మాట్లాడుతూ "ప్రస్తుతం హారర్ చిత్రాల ట్రెండ్ నడుస్తోంది. ప్రతీ క్షణం ఉత్కంఠభరితంగా సాగే ఈ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్ ప్రేక్షకులను తప్పక మెప్పిస్తుంది. హారర్ చిత్రాల్లో సరికొత్త ఒరవడిని సృష్టిస్తుంది" అని చెప్పారు.

ఆకట్టుకునే ఓ తండ్రి కథ



దిగ్గజ గాయకులు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తనయుడు ఎస్పీ చరణ్ కీలకపాత్రధారిగా తెరకెక్కిన చిత్రం 'లైఫ్'(లవ్ యువర్ ఫాదర్). పవన్ కేతరాజు దర్శకత్వంలో కిషోర్ రాఠీ, మహేశ్ రాఠీ, రామస్వామి రెడ్డి నిర్మించారు. శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటించారు. మణిశర్మ సంగీతం అందించారు. ఈనెల 4న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'చరణ్ సహకారం వల్ల సినిమా అద్భుతంగా వచ్చింది. ఈ సినిమాలో తండ్రి గొప్పదనాన్ని అద్భుతంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశాం' అన్నారు. మన జీవితాలతో ముడిపడిన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకొని తెరకెకించిన చిత్రం ఇదని చరణ్ చెప్పారు.

సరికొత్త పాత్రలో...



వైవిధ్యమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన కథానాయకుడిగా మరో కొత్త చిత్రం పట్టాలెక్కనుంది. గోపీ ఆచార దర్శకత్వంలో బి.నరేంద్ర రెడ్డి నిర్మించనున్నారు. సోమవారం, ఈ చిత్రాన్ని ప్రకటించిన సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "సినిమా పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. సుహాస్ పాత్ర చాలా కొత్తగా ఉండబోతోంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. జూలై నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమవుతుంది. సినిమాకు సంబంధించిన ఇతర తారాగణాన్ని, సాంకేతిక సిబ్బందిని త్వరలోనే ప్రకటిస్తాం" అని తెలిపారు. ప్రస్తుతం 'ఓ భామా అయ్యోరామ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు సిద్ధమయ్యారు సుహాస్.

కుటుంబ కథా చిత్రం



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా దర్శకద్వయం నితిన్-భరత్ తెరకెక్కించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈనెల 11న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ కుటుంబ కథా చిత్రాన్ని మాంక్స్ అండ్ మంకీస్ బ్యానర్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో ప్రదీప్ మాట్లాడుతూ 'సినిమా ఆద్యంతం ఎంటర్‌టైన్‌మెంట్‌తో ఉంటుంది. భవిష్యత్తులో మరిన్ని మంచి సినిమాలు చేయడానికి ఈ చిత్రం ఒక మెట్టు అవుతుందని భావిస్తున్నాం' అని అన్నారు. దర్శకులు నితిన్-భరత్ మాట్లాడుతూ 'సినిమా చాలా అద్భుతంగా వచ్చింది' అని చెప్పారు. హీరోయిన్ దీపిక మాట్లాడుతూ 'తన క్యారెక్టర్‌లో ఎన్నో ఎమోషన్స్ ఉంటాయి' అని తెలిపారు.

మరింత చేరువవుతా

వైష్ణవి చైతన్య



'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్నారు. సిద్ధు జొన్నలగడ్డతో బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో ఆమె నటించిన 'జాక్' ఈ నెల 10న విడుదలవుతోంది. అలాగే, ఆనంద్ దేవరకొండతో ఓ చిత్రంలో నటిస్తున్నారు. తాజాగా, 'జాక్' సినిమా ప్రమోషన్స్‌లో మీడియాతో ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు ఆమె. "ఇప్పటివరకూ అన్నీ సీరియస్ పాత్రలే చేశాను. 'జాక్'లో డ్యూయల్ రోల్ పోషించాను. ఇందులో ఓ పాత్ర చాలా వినోదాత్మకంగా ఉంటుంది. ఈ చిత్రంతో కుటుంబ ప్రేక్షకులకు మరింత చేరువవుతాను" అని చెప్పారు.

శక్తిమంతమైన పాత్రలో...



'బబుల్‌గమ్' ఫేమ్ రోషన్ కనకాల, సాక్షిసాగర్ మడోల్కర్ జంటగా నటిస్తున్న చిత్రం 'మోగ్లీ 2025'. సందీప్‌రాజ్ దర్శకత్వంలో పీపుల్‌మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో దర్శకుడు, నటుడు బండి సరోజ్‌కుమార్ 'క్రిస్టోఫర్ నోలన్' అనే ఓ శక్తిమంతమైన పాత్రను పోషిస్తున్నారు. తాజాగా, చిత్రంలో ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటింగ్: కోదాటి పవన్‌కల్యాణ్, డీఓపీ: రామమారుతి.ఎం, సంగీతం: కాలభైరవ.

శివాలయం ట్రస్టుబోర్డు చైర్మన్‌గా కోటేశ్వరరావు



మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కోటేశ్వరరావు

మంగళగిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మెట్ల మార్గంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (శివాలయం) ట్రస్టుబోర్డు చైర్మన్‌గా బోగి కోటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతో పాటు మరో 8 మంది ట్రస్టు బోర్డు డైరెక్టర్లుగా నియమితులయ్యారు. వారిలో సుఖమంచి గిరిబాబు, ఎ. కరుణ, జంజనం వెంకట సుబ్బారావు, చిలకా బసవమ్మ, ఉడతా లావణ్య, బాపనపల్లి వాసు, ఇసుకపల్లి వెంకట లలిత, తిరుమలశెట్టి మురళీకృష్ణ ఉన్నారు. శివాలయం ప్రధాన అర్చకుడు తెలిదేవరపల్లి మహేష్ కుమార్‌శర్మను ఎక్స్ అఫిషియో మెంబరుగా ఎన్నుకున్నారు. తనకు చైర్మన్ పదవిని కేటాయించిన మంత్రి నారా లోకేశ్‌కు కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.

రైతు సదస్సును జయప్రదం చేయాలి

తాడికొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులను నష్టపరిచే విధంగా తీసుకువస్తున్న చట్టాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన రైతు సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చల శివాజీ కోరారు. రైతు సదస్సుకు రైతులు తరలిరావాలని రైతు సంఘం నాయకులు సోమవారం తాడికొండలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీన విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో రైతు సదస్సు జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నల్లచట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సదస్సుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు చింతల భాస్కరరావు, కే పూర్ణ, శ్రీరాములు, కొండయ్య పాల్గొన్నారు.

ముస్లింల రాస్తా రోకో

ఫిరంగిపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురంలోని సొలస బస్టాప్ సెంటర్లో రంజాన్ సందర్భంగా కరెంటు తరచూ పోవటంతో ఆగ్రహించిన ముస్లింలు 20 నిమిషాల పాటు రాస్తారోకో జరిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు విద్యుత్ ఏఈని సంప్రదించి రేపటి లోగా ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తామన్న హామీపై రాస్తారోకోను విరమించారు. రంజాన్ పర్వదినాన విద్యుత్ లేక ఇబ్బందులు పడ్డామని వారు తెలిపారు.

దేవుడి కరుణ ప్రజలపై ఉండాలి

● అబ్దుల్ ఖుద్దూస్



బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బాజీతో అబ్దుల్ ఖుద్దూస్

కాకుమాను, మార్చి 31(ఆంధ్రజ్యోతి): అల్లా కరుణ రాష్ట్ర ప్రజలపై ఉండాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ ఖుద్దూస్ ఆకాంక్షించారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బాజీకి శుభాకాంక్షలు తెలిపారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఖుద్దూస్ మాట్లాడుతూ నిష్ఠ, ధర్మాచారణ, ఉపవాసం, ఈద్‌ఉల్ ఫితర్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఆయన వెంట బీజేపీ మైనార్టీ నాయకులు ఉన్నారు.



దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లోని మసీదుల్లో పేషిమాం, ఇమామ్‌లకు మంత్రి నారా లోకేశ్ పంపిన నూతన వస్త్రాలను ఆదివారం సాయంత్రం అందించారు. కార్యక్రమంలో జి.వెంకట్రావు, బాషా, కరీముల్లా, పలువురు ముస్లింలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. **(దుగ్గిరాల)**

బస్టాప్ నిర్మాణానికి శంకుస్థాపన



బస్టాప్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాధికారెడ్డి

ఫిరంగిపురం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములూరిపాడులో గల శ్రీ జలపాలేశ్వర స్వామి ఆలయం ముందు ఫిరంగిపురం యూనియన్ బ్యాంకు సౌజన్యంతో రూ.2.80 లక్షల వ్యయంతో నిర్మించే బస్టాప్‌కు ఆ బ్యాంకు మేనేజర్ ఈ రాధికారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొరివి చిన ఆనంద్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కటికల రామకోటేశ్వరరావు, గ్రామ పెద్దలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

పెదనందిపాడు, మార్చి 31: మండల పరిధిలోని రాజుపాలెంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం మహిళలకు గ్రామ సర్పంచ్ కమ్మ నాగమల్లేశ్వరరావ సోమవారం చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు

భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



తాడికొండలో రంజాన్ ప్రార్థనల కోసం వెళ్తున్న ముస్లింలు



మంగళగిరి ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మంగళగిరి సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పర్వదినాన్ని సోమవారం నియోజకవర్గమంతటా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షలు, దానధర్మాలు, ప్రత్యేక నమాజ్‌లతో మంగళగిరిలో రంజాన్ మాసమంతటా ఆధ్యాత్మిక శోభ పరిఢవిల్లింది. రంజాన్ సందర్భంగా సోమవారం వేకువజాము నుంచే ముస్లింలు మసీదులు, ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక నమాజ్‌లను ఆచరించారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అంజుమన్-యి-హిమాయతుల్ ఇస్లాం సంస్థ ఆధ్వర్యంలో ఈద్గా, మసీదుల వద్ద ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. ఉదయం 9:30 గంటలకు పాత బస్టాండు వద్ద గల జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఈద్గా వద్ద సామూహిక ప్రార్థనలు జరిగాయి. రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ షేక్ అక్రం, అంజుమన్ అధ్యక్షుడు షేక్ అల్తాఫ్, ఇస్లామిక్ ఫ్రంట్ అధ్యక్షుడు షేక్ రియాజ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దుగ్గిరాల మండలంలో..

దుగ్గిరాల, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో రంజాన్ పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకుని సామూహికంగా ప్రార్థనల్లో పాల్గొన్నారు. పెనుమూలి, చిలువూరు, దుగ్గిరాల, కేఆర్‌కొండూరు, తుమ్మపూడి, రేవేంద్రపాడు, మోరంపూడి తదితర గ్రామాల్లో ఈద్గాల వద్దకు చేరుకున్న ముస్లింలకు మంచితనం మానవత్వం, సాటివారికి సాయపడే ప్రతిఒక్కరూ అల్లాకు చేరువగా ఉంటారని వివరించారు. పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వట్టిచెరుకూరు మండలంలో..



పుల్లడిగుంటలోని ఈద్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు, మత పెద్దలు

వట్టిచెరుకూరు, (ఆంధ్రజ్యోతి): ముస్లింలు పవిత్ర రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పుల్లడిగుంట ఈద్గాకు పరిసర గ్రామాల్లోని ముస్లింలు తరలిరావటంతో ఆ ప్రాంతం ముస్లింలతో కిక్కిరిసి పోయింది. ఈద్గాకు తరలి వెళ్లే సమయంలో పరస్పరం ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, ఎంపీడీవో రమేష్‌బాబు, సూపరింటెండెంట్ హేమంత్, డిప్యూటీ తహసీల్దార్ దరియావలి, వ్యవసాయశాఖ ఏవో కే లక్ష్మి, ఇతర మండల అధికారులు, ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

కాకుమాను, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కాకుమానులో పడమర చెరువు వద్ద ఉన్న మసీదులో మత పెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు. కొండపాటూరు, రేటూరు, లింగంగుంటపాలెం, పాండ్రపాడు, కొమ్మూరు, తదితర గ్రామాల్లో రంజాన్ జరుపుకున్నారు.

పెదనందిపాడు, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల వ్యాప్తంగా జరిగిన పండుగలో ముస్లిం మతపెద్దలు రంజాన్ విశిష్టతను వివరించారు.

తాడికొండ మండలంలో..

తాడికొండ, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రంజాన్ ఉపవాస దీక్షలను ఉపసంహరించిన ముస్లింలు సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రార్థనలు నిర్వహించి, పరస్పరం ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. తాడికొండలోని మసీదుల దగ్గర నుంచి ప్రదర్శనగా కొండ వెనుక ఉన్న ఈద్గాకు చేరుకుని, భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా జామియా మసీదు పేష్మామ్(ముఫ్తి) ప్రవక్త సూక్తులను వివరించారు. లాం, నిడుముక్కల, రావెల, బేజాత్పురం, పాములపాడు తదితర గ్రామాల్లో ముస్లింలు రంజాన్ ప్రార్థనలు నిర్వహించారు.

తుళ్లూరు మండలంలో..

తుళ్లూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలో రంజాన్ పర్వదినాన్ని భక్తి శ్రద్ధలతో సోమవారం ముస్లింలు నిర్వహించుకున్నారు. తుళ్లూరు, రాయపూడి, మందడం, వెంకటపాలెం, పెదపరిమి, నేలపాడు, బోరుపాలెం, హరిశ్చంద్రపురం తదితర గ్రామాల్లో రంజాన్ పండుగను నిర్వహించుకున్నారు. మనస్సును మంచితో నింపుకోవాలని మత గురువులు ప్రబోధించారు. గత టీడీపీ ప్రభుత్వం రాజధాని ప్రకటించిన దగ్గర నుంచి ఈద్గాకు స్థలం కేటాయించమని అడుగుతున్నామని రాయపూడిలో ముస్లింలు అధికశాతం ఉన్నారని పండుగను రోడ్ల మీద చేసుకోవాల్సి వస్తుందని ముస్లింలు ఆవేదన వ్యక్తం చేశారు. సీడ్ రోడ్డు మీద టెంట్లు వేసుకొని నమాజ్ నిర్వహించుకున్నారు.



రాయపూడి సీడ్ యాక్సెస్ రోడ్డులో నమాజ్ చేస్తున్న ముస్లింలు

మేడికొండూరు మండలంలో..

మేడికొండూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఈద్గాల, మసీదుల వద్దకు ముస్లింలు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఇమామ్‌లు రంజాన్ ప్రాముఖ్యాన్ని వివరించారు. ప్రతి ఏడాది ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని జరుపుకుంటారని, నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఉండి అల్లా అనుగ్రహం పొందుతారని తెలిపారు.

ఆయుష్ మిషన్‌ను నిర్వీర్యం చేసిన వైసీపీ

● రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నసీర్, బీజేపీ నేత జయప్రకాష్ నారాయణ

గుంటూరు, మార్చి 31(ఆంధ్రజ్యోతి): కేంద్రం జాతీయ ఆయుష్ మిషన్ కింద కోట్లాది రూపాయలు నిధులు విడుదల చేస్తే గత వైసీపీ ప్రభుత్వం తుంగలో తొక్కి సర్వనాశనం చేసిందని రాష్ట్ర ఆరోగ్య, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. గుంటూరు రూరల్ పరిధి, పొత్తూరు గ్రామంలో ఉన్న స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బీజేపీ నాయకులు వల్లూరు జయప్రకాశ్ నారాయణతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్రం 2014లో ఆయుష్‌కు ప్రత్యేక మంత్రిని నియమిస్తే 2019 తర్వాత ఏపీలో ఆయుష్ సంస్థను ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసి నిధులు మురిగిపోయేలా చేసిన ఘనత జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. వికసిత భారత్ పేరుతో మోదీ చిత్తశుద్ధితో ఉంటే ఏపీ అభివృద్ధే ధ్యేయంగా విజనరి లీడర్ చంద్రబాబునాయుడు ఉండటం గర్వంగా ఉందని అన్నారు. ఆయుర్వేదం అంటే మనకి కేరళే గుర్తుకు వస్తుంది కానీ నేడు మన దగ్గర కూడా అద్భుతమైన చికిత్సలు అందించడం గర్వకారణమని అన్నారు. ఆయుర్వేద ఆస్పత్రుల్లో ఉన్న ఖాళీ ఉద్యోగాలపై దృష్టి సారించి చర్యలు చేపట్టామని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులుగా డా. కేఎస్ఆర్ గోపాలన్ ఆరోగ్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ఆల్కహాల్ డీఎడిక్షన్ సెంటర్ కూడా ప్రారంభించి ఆయుర్వేద వైద్యం ద్వారా మద్యం బారిన పడిన బాధితులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చైతన్య, వైద్యులు ప్రేమానంద్, విజయ భాస్కర్, సాయి సుధాకర్, మన్నవ రాధాకృష్ణమూర్తి, హిమసాగర చంద్రమూర్తి, కేఎస్ఆర్ కుటుంబరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరు తిరుపతిరావు, కొర్రపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


చిర్రావూరులో టీడీపీ నూతన కార్యాలయం ప్రారంభం



ప్రసంగిస్తున్న మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు

తాడేపల్లి (చిర్రావూరు), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో టీడీపీ గ్రామ అధ్యక్షుడు కాసరగడ్డ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీడీపీ నూతన కార్యాలయాన్ని సోమవారం పద్మశాలి చేనేత కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించడమే కాక మహిళలను రాజకీయంగా చైతన్యవంతులను చేసిన పార్టీ టీడీపీ అన్నారు. మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు పీ-4ను తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో తెలుగురైతు గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కొమ్మారెడ్డి కిరణ్, పట్టణ మాజీ అధ్యక్షుడు జంగాల సాంబశివరావు, మాజీ జడ్పీటీసీ దండమూడి శైలజారాణి, ఖాసింఖాన్, నాగయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వర ఆలయానికి వెండి వస్తువుల సమర్పణ



వెండివస్తువులు తీసుకెళుతున్న దాత వెంకటేశ్వరరావు దంపతులు

తాడేపల్లి (కుంచనపల్లి), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లికి చెందిన రైతు సంఘం నాయకులు కాజ వెంకటేశ్వరరావు రమాదేవి దంపతులు గ్రామంలో కొలువైవున్న శ్రీగంగా కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవాలయానికి రూ.135000 విలువ చేసే వెండి నాగపడిగ, వెండి కిరీటాన్ని ఆలయ పూజారికి గ్రామస్థుల సమక్షంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా దాత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన కాశీ విశ్వేశ్వర ఆలయానికి నాగపడిగ కిరీటం ఇవ్వడం ఆనందంగా ఉందని గతంలో కూడా ఆలయానికి వెండి కిరీటం, చటారి, వెండి పళ్లెం సమర్పించామన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకుని ఈ వితరణ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కాజ కాశీ రాంబాబు, కొట్రగడ్డ ఆంజనేయులు, గ్రామ పెద్దలు చాగంటి వెంకటరెడ్డి, కంచుకొమ్మల వెంకటేశ్వరరావు, కాజ సుబ్రహ్మణ్యం, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, మహాలక్ష్మి అమ్మవారి గణేష్ యూత్, మహిళలు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లి (గుండిమెడ), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గుండిమెడ గ్రామంలో అధ్వానంగా ఉన్న పారిశుధ్య పరిస్థితిని పరిశీలించి మురుగునీటి సమస్యను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శి పల్లె కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండల మాజీ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, నాగపోగు విజయరాజుతో కలిసి మురుగునీటిని పరిశీలించారు. కృష్ణ మాట్లాడుతూ గ్రామంలో డ్రైయినేజి వ్యవస్థ లేకపోవడంతో పారిశుధ్యం అధ్వానంగా ఉందన్నారు. సీపీఎం మండల మాజీ కార్యదర్శి వెంకటరెడ్డి మాట్లాడుతూ మురుగునీరు భూగర్భజలాల్లో ఇంకిపోవడం వల్ల తాగునీరు కలుషితమైందన్నారు గ్రామంలో డ్రైయినేజిని నిర్మించాలని అధికారులను డిమాండ్ చేశారు.

హత్యలతో ఉద్యమాలు ఆగవు

● సీపీఎం నేత జొన్నా శివశంకర్

తాడేపల్లి టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): హత్యలతో ఉద్యమాలు ఆగవని సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకర్ అన్నారు. తాడేపల్లి సుందరయ్యనగర్‌లో దివంగత సీపీఎం నేత మాలకొండారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్థూపం వద్ద నిర్వహించిన సంతాప సభలో శివశంకర్ మాట్లాడుతూ ఆనాడు సీపీఎం అభివృద్ధిని చూసి ఓర్వలేక కాంగ్రెస్ గూండాలు మాలకొండారెడ్డిని హత్య చేశారన్నారు. సీపీఎం నేత దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుండి పని చేసిన సేవాతత్పరుడు మాలకొండారెడ్డి అన్నారు. సుందరయ్యనగర్ కరకట్ట అభివృద్ధిలో ఆయన పాత్ర ఉందన్నారు.

విజేత స్పోర్ట్స్ క్రీడాకారులకు పురస్కారాలు



పురస్కారాలు అందుకున్న విజేత స్పోర్ట్స్ ప్రతినిధులు

మంగళగిరి సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరుకు చెందిన గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో ఉత్తమ కోచ్‌లు, క్రీడాకారులకు ఉగాది పురస్కారాలను అందజేశారు. మంగళగిరికి చెందిన విజేత స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కోచ్ వీవీఎస్‌బీ సత్యనారాయణ, సభ్యులు డాక్టర్ కే శంకర్‌రెడ్డి, కే రమేష్‌లకు ఉగాది క్రీడా పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన నాసా మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా మంగళగిరిలో క్రీడాకారులకు సత్యనారాయణ అందించిన సేవలను గుర్తిస్తూ క్రీడా పురస్కారాన్ని అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు, గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జీ శివప్రసాద్, మోడరన్‌పెంటా తలాన్ చీఫ్ కోచ్ గమిడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఉండవల్లిలో శ్రీరామధనస్సు శోభాయాత్ర



ఉండవల్లి విచ్చేసిన శ్రీరామధనస్సు

తాడేపల్లి (ఉండవల్లి), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామమందిరానికి విరాళంగా పది కేజీల వెండి, కేజీ బంగారంతో దాత చల్లా శ్రీనివాస శర్మ శ్రీరాముని ధనస్సు, బాణం తయారు చేయించారు. ఈ ధనస్సు, బాణం శోభాయాత్ర దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే కార్యక్రమ నిర్వాహకులు కనసాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తాడేపల్లి మండలం ఉండవల్లిలో గ్రామోత్సవం నిర్వహించి సోమవారం కాపుల బజారులోని కోదండరామాలయంలో భక్తుల దర్శనార్థం ఉంచారు. ఈ సందర్భంగా దాత చల్లా శ్రీనివాసశర్మను గంగోత్రి పీఠాధిపతి అద్వైతానంద మహరాజ్, గౌడి మఠం పీఠాధిపతి భక్తి సుందర్‌జీ, మహామండలేశ్వర్ కృష్ణకిషోర్‌లు మాట్లాడుతూ ఈ శోభాయాత్ర నవంబరు నెలలో అయోధ్యకు చేరుకుంటుందని ఈ ధనస్సు, బాణం స్వామివారికి అలంకరణ చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి

● ఎమ్మెల్యే రామాంజనేయులు



సీసీ రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

గుంటూరు(తూర్పు), మార్చి 31 (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. స్థానిక 41వ డివిజన్, తారాకరామానగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణపనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్ల నిర్మాణాల్లో అవకతవకలు జరిగితే సహించేదిలేదని స్పష్టం చేశారు. అవసరమైతే సదరు కాంట్రాక్టరును బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన పీ-4 కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నేడు జరిగే పెన్షన్ల పంపిణీలో పంచాయతీ సిబ్బంది, సచివాలయ అధికారులు పాల్గొని సకాలంలో కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్మిత పద్మజ, గింజుపల్లి వెంకటేశ్వరరావు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పదిన ఒంటిమిట్ట సీతారాములకు పట్టువస్త్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం జిల్లా అధ్యక్షుడు మహేష్

మంగళగిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండ రామాలయంలో వేంచేసియున్న సీతారాముల కల్యాణ మహోత్సవం సందర్భంగా ఏపీ పద్మశాలి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను సమర్పించనున్నట్టు స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ తెలిపారు. మంగళగిరి స్వర్ణకార సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ పద్మశాలీ సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన గరుడసేవలో భాగంగా శ్రీసీతారామస్వాములకు పట్టువస్త్రాలు సమర్పిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పద్మశాలీయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి కల్యాణ మహోత్సవాన్ని తిలకించాలని కోరారు. ఈ సమావేశంలో సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాడా జానకిరామయ్య, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వుడతా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి తిరువీధుల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సమాజ అభ్యున్నతికి ఉద్యోగులు కృషి చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

మంగళగిరి సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): బీసీ సమాజ అభ్యున్నతి కోసం ఉద్యోగులు కృషి చేయాలని, అందుకోసం పే బ్యాక్ టు ది సొసైటీ నియమాన్ని ప్రతి ఒక్కరూ అమలు పరచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం ఉద్యోగుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంవీవీఎస్ఎన్ మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో శంకరరావు మాట్లాడుతూ మూర్తి అనేక దశాబ్దాలుగా ఉద్యోగులను ఐక్యపరుస్తూ, వారి సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించారని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో బడుగు వర్గాలు వారి జీవితాలను మార్చుకోగలిగే స్థితిలో లేరని, వారికి ఆర్థిక వెసులుబాటు కలిగిన ఉద్యోగులు అండగా నిలిచి బీసీ సమాజ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు. ఈ నెల 4వ తేదీన గుంటూరు వేంకటేశ్వర విజ్ఞాన మందిరం పక్కన గల టీటీడీ కల్యాణ మండపంలో జరిగే రాష్ట స్థాయి విస్తృత సమావేశంలో బీసీలు పెద్దసంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కుమ్మర క్రాంతి కుమార్, పారేపల్లి మహేష్, మూర్తి, నేతలు శివరాం బాబాజీ, బాదుగున్నల శ్రీనివాస్, కోలా అశోక్, గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, కొల్లూరి హనుమంతరావు, జంజనం వరప్రసాద్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఈద్ నమాజ్‌లో ముస్లిం మహిళల నిరసన



ఈద్ నమాజ్ అనంతరం నిరసన తెలుపుతున్న ముస్లిం మహిళలు

మంగళగిరి సిటీ, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా మంగళగిరి నిడమర్రు రోడ్డులోని అరవింద పాఠశాలలో అన్వరీ ఇస్లామిక్ సెంటరు ఆధ్వర్యాన ఈద్ నమాజ్ నిర్వహించారు. ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ ఖురాన్ అవతరించిన మాసం కావడంతో రంజాన్ నెల ముస్లింలకు అత్యంత పవిత్రమైన మాసమని, ఈ నెలంతా ఖురాన్ పఠనం, ప్రత్యేక ప్రార్థనలు, ధార్మిక సేవలు, దానధర్మాలతో జరుపుకుంటారని తెలిపారు. ప్రార్థనలకు హాజరైన మహిళలు వక్ఫ్ సవరణ బిల్లుపై తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. ప్లకార్డులు చేతబూని శాంతియుతంగా నిరసన తెలియజేశారు. ఈ బిల్లుతో ముస్లింల హక్కులకు, ప్రార్థనాలయాలకు, వక్ఫ్ ఆస్తుల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. ముస్లింల మనోభావాలను గౌరవించి వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వకుండా న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు.

ఉమా జయసత్య దంపతులకు మంత్రి పరామర్శ



మాణిక్యం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి నారాయణ

మంగళగిరి, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ఎర్రబాలెం మాజీ ఎంపీటీసీ, టీడీపీ నేత ఆకుల ఉమామహేశ్వరరావు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య దంపతులను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పీ నారాయణ సోమవారం సాయంత్రం పరామర్శించారు. ఉమామహేశ్వరరావు మాతృమూర్తి మాణిక్యం ఈ నెల 24వ తేదీన కన్నుమూశారు. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణ ఎర్రబాలెం వచ్చి మాణిక్యం చిత్రపటానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, నేతలు నీలం అంకారావు, గడదాసు రంగారావు, ఫిరోజ్ ఖాన్, కర్నాటి శివసత్యనారాయణ, సాలి నరేష్, యలమంచిలి పద్మజ పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

మహిళల ఆందోళనతో మద్యం షాపు తరలింపు

తెనాలి క్రైం, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముత్తంశెట్టిపాలెంలో ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలని డిమాండ్ చేస్తూ మహిళలు, స్థానికులు ఆదివారం పెద్ద ఎత్తున చేపట్టి నిరసన, ధర్నాలు రాత్రింబవళ్లు కొనసాగాయి. సమస్య తీవ్రతను గుర్తించిన అధికారులు సోమవారం ఉదయం అక్కడ నుండి షాపులో ఉన్న మద్యంను తరలింపజేశారు. లైసెన్స్‌దారునకు షాపును ఆ ప్రాంత వాసులకు ఇబ్బందికరంగా లేని చోట ఏర్పాటు చేసుకోవలసినదిగా సూచించినట్లు ఎక్సైజ్ సీఐ వెంకటాచలం తెలిపారు. ప్రస్తుతం ఈ షాపు టెంపరరీ లైసెన్స్‌పై నడుస్తోంది. మద్యం షాపును ఆ ప్రాంతం నుంచి తొలగించడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేశారు.

పాలిటెక్నికల్ ఎంట్రన్స్‌కు ఉచిత శిక్షణ

పొన్నూరు టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని నిడుబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాలిటెక్నికల్ ప్రవేశ పరీక్ష కోసం ఉచిత శిక్షణ తరగతులు ఏప్రిల్ 2 నుంచి నిర్వహించనున్నట్లు వెలగా నాగేశ్వరరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ నిర్వాహకులు సోమవారం తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన వారు, పరీక్షలు రాసిన వారు ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. ఇతర వివరాల కోసం 9652091975, 9693442233 నెంబర్‌లను సంప్రదించాల్సిందిగా సూచించారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి రూ.25 వేల సాయం

తెనాలి అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన టీడీపీ కార్యకర్త ఖాజాఖాన్ కుటుంబానికి రూ.25 వేల సాయం అందించారు. మారీసుపేట టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఖుద్దూస్, సుభాని, అహ్మద్, ఖాసీం పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలి, మారీసుపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని శ్రీ శివలింగేశ్వరస్వామి భక్తబృందం సేవా సమితి సభ్యులు నిర్వహించారు. సోమవారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో శ్రీశివలింగేశ్వర స్వామి భక్తబృందం సేవాసమితి కార్యాలయం వద్ద సేవాసమితి గౌరవాధ్యక్షుడు కాసా రామ శ్రీను జన్మదినం సందర్భంగా సమితి అధ్యక్షుడు కుర్రా శ్రీను, మీరావలి మిత్రబృందం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మునిపల్లి వంశీ, అబ్దుల్ మతీన్, పోతురాజు, శివ, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక కౌంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

పన్ను వసూలు కౌంటర్‌ను పరిశీలించిన మునిసిపల్ కమిషనర్

తెనాలి, మారీసుపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ప్రజలు పన్నులు చెల్లించేందుకు తెనాలి పురపాలకసంఘం పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేకకౌంటర్‌ను పట్టణ మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న పరిశీలించారు. సోమవారం స్థానిక స్వరాజ్ టాకీస్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన పన్నువసూలు కేంద్రాన్ని మునిసిపల్ కమిషనర్ శేషన్న ఆకస్మిక తనిఖీని చేసి పన్ను వసూళ్ల తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు

తెనాలి, మారీసుపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిసర ప్రాంతాలలో పవిత్ర రంజాన్ పండుగ పర్వదినాన్ని పురష్కరించికొని ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. సోమవారం స్థానిక చెంచుపేటలోని ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్వమానవ సమానత్వానికి, సుహృద్భావానికి, సామరస్యానికి, కరుణకు దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగన్నారు. రాష్ట్ర ప్రజలందరికి అల్లా దయతో అంతా మంచే జరగాలని కోరుతున్నానన్నారు. అనంతరం ముస్లింలను ఆలింగనం చేసుకొని ఈద్ శుభాకాంక్షలు తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణ - 2024ను నిలుపుదల చేయాలని ఆలపాటికి వినతి

తెనాలి, మారీసుపేట, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణ-2024ను ముస్లింలు వ్యతిరేకిస్తున్నారని వారి మనోభావాలను గౌరవిస్తూ చట్ట సవరణను నిలుపదల చేసేలా కృషిచేయాలని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మైనార్టీ నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. సోమవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని చెంచుపేట ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మజ్లిసుల్ ఉలమా - అయిమ్మా జమియతే ఉలమా హింద్ తెనాలి సభ్యులు వక్ఫ్ చట్ట సవరణ 2024పై ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, పెద్దఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.

కొలకలూరులో..

తెనాలి రూరల్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ పండుగను సోమవారం ముస్లింలు భక్తిప్రపత్తులతో జరుపుకున్నారు. మండలంలోని కొలకలూరులో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ సహకారంతో నిర్మించిన ఈద్గాను రంజాన్ పర్వదిన వేళ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మత పెద్దలతో కలిసి ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో నియమనిష్ఠలతో ఉపవాసదీక్షలు చేసి, స్తోమతకు తగ్గట్లు దానధర్మాలు చేయటం అభినందనీయమన్నారు. ఈద్గా పనులను దగ్గరుండి చేయించిన మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అంజుమన్-ఎ- ఇస్లామియా కమిటీ అధ్యక్షుడు షేక్ అజీజ్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దాదాపుగా రూ.14లక్షలతో ప్రహరీ, గేట్ల పునఃనిర్మాణం చేశారని ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కమిటీ సభ్యులు షేక్ మస్తాన్, అమీర్‌బాషా, పఠాన్ కరిముల్లా, మహ్మద్ ఇక్బాల్ బాషా, షేక్ ఖాజానజుముద్దీన్, షేక్ జాని, షేక్ హమీద్, అబ్దుల్లా, సుభాని, కరిముల్లా, నూరుద్దీన్, అక్బర్‌బాషా, సయ్యద్ ఖాసీమ్, షేక్ గౌస్, మహ్మద్ రఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల అభ్యున్నతికి పాటుబడిన వైసీపీ

● మాజీ ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి పాటుబడింది వైసీపీ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. సోమవారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లిం, మైనార్టీలను వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కలుసుకుని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అల్లా కరుణ ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్



కొలకలూరులో ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



తెనాలి: పుచ్చకాయలు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు



కొల్లిపర మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

ముస్లింలకు పుచ్చకాయలు పంపిణీ

తెనాలి అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం సోదరులకు చిరంజీవి యువత ఆధ్వర్యంలో పుచ్చకాయలు పంపిణీ చేశారు. ఈద్గా దగ్గర జనసేన నేత వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఇస్మాయిల్ బేగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మసీదుల్లో హఫీజ్‌లు, మౌజమ్‌లకు జీతాలు అందని పక్షంలో వక్ఫ్‌బోర్డును లేదా ఓఎస్‌డీని సంప్రదించాలని కోరారు. అనంతరం ఈద్గా రోడ్డును శుభ్రం చేశారు.

కొల్లిపరలో...

కొల్లిపర, మార్చి 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని దావులూరు, తూములూరు, మున్నంగి, కొల్లిపర గ్రామాల్లో ముస్లింలు సోమవారం ఘనంగా రంజాన్ పండుగను జరుపుకున్నారు. తెల్లవారుజామున మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రంజాన్ పండుగ పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో ముస్లింలు సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు నెలవంక దర్శనంతో ఉపవాసాలను విరమించారు. రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్)ను పురస్కరించుకుని పొన్నూరు పట్టణం, మండలం, చేబ్రోలు మండలంలో అన్ని మసీదులను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఉదయం నుంచి మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పొన్నూరు పట్టణంలోని ప్రధాన మసీదు, చౌక్ మసీదు, దాహేరా మసీదు, ఇటికంపాడు మసీదు, తదితర మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఇటికంపాడు రోడ్డులోని ఈద్గా వద్ద జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో వేలాదిమంది ముస్లింలు హాజరయ్యారు. ఈ ప్రత్యే ప్రార్థనల్లో స్థానిక ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ నూతన కార్యవర్గాన్ని పట్టణంలోని ముస్లింలకు పరిచయం చేశారు. కమిటీ నూతన అధ్యక్షుడు మగ్బుల్ బేగ్ ఆదాయ వ్యయాలను వివరించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. సంగం డెయిరీ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద మజ్జిగ పంపిణీ నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని చింతలపూడి, వడ్డిముక్కల, ఇటికంపాడు, తదితర గ్రామాలతో పాటు చేబ్రోలు మండలంలోని చేబ్రోలు, వేజెండ్ల, సుద్దపల్లి, గుండవరం, గొడవర్రు తదితర గ్రామాలలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఆనందోత్సాహాల నడుమ పండుగలను జరుపుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి: ఎమ్మెల్యే ధూళిపాళ్ల

పొన్నూరు టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): ముస్లింల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. రంజాన్ పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని ఈద్గాలో ముస్లింలతో కలసి ఎమ్మెల్యే నరేంద్రకుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతేడాది ఎన్నికల ముందు ఈద్గాలో ప్రార్థనలకు హాజరై అల్లా ఆశీస్సులు కోరినట్లు చెప్పారు. భగవంతుడి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందిన తాను అల్లాకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ ఏడాది ప్రత్యేక ప్రార్థనలకు హాజరయ్యానన్నారు. పొన్నూరు పట్టణంలో ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపనున్నట్లు చెప్పారు. షాదీఖానా, నిర్మాణం పూర్తి చేయడానికి రూ.3 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. అలాగే ఇటికంపాడు రోడ్డులో ఖబర్‌స్థాన్ ఏర్పాటుకు ప్రభుత్వంతో భూసేకరణ చేయించనున్నట్ల చెప్పారు. 22ఏ కింద ఉన్న భూములను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానన్నారు. ముస్లింలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని, ముస్లింల అభ్యున్నతికి పాటుపడుతానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి

ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం కృషి

● ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి అర్బన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉపాధి అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని శాసన మండలి సభ్యుడు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన డ్వాక్రా మహిళల తెనె విక్రయ స్టాల్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గతంలోనే డ్వాక్రా సంఘాలను ప్రోత్సహించారన్నారు. సంఘాల ద్వారా ఎంతో మంది మహిళలు తమ కుటుంబ ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నారన్నారు. మాజీ ఎంపీపీ సూర్యదేవర వెంకట్రావు, లక్ష్మీ, లోకేశ్వరి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



మహాకుంభాభిషేక పూజల్లో పాల్గొన్న భక్తులు

కుంభాభిషేక ఉత్సవాలు ప్రారంభం

పొన్నూరు టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో తెలగపాలెం కోదండరామాలయంలో సోమవారం మహా కుంబాభిషేక మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. కోదండ రామస్వామి ఆలయం ఏర్పడి నూరు వసంతాలు పూర్తయిన సందర్భంగా ఈ కుంబాభిషేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మందిరంలో విశ్వక్సేనపూజ నిర్వహించి అఖండ దీపస్థాపన చేశారు. ఉత్సవాలకు అంకురారోపణ చేశారు. ఈ పూజా కార్యక్రమాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రహ్మాకుమారీల ర్యాలీ

పొన్నూరు టౌన్, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో సోమవారం బ్రహ్మకుమారీలు ప్రదర్శన నిర్వహించారు. విశ్వావసు నామ ఉగాది పండుగను పురస్కరించుకుని బీకే బెహన్ తులసీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. శివలింగాలను చేతబూనిన బ్రహ్మకుమారీలు గ్రామంలో ప్రదర్శన నిర్వహించి వసంత రుతువు కాలంలో రైతులు పాడి పంటలతో సుఖ సంతోషాలతో విరజిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీకే శివపార్వతి, లక్ష్మీ, కోటేశ్వరి, రమణ, తదితరులు పాల్గొన్నారు.



వల్లభరావుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్నబ్రహ్మకుమారీలు



ప్రముఖ రంగస్థల కళాకారుడు వెంకటేశ్వరరావును పరామర్శిస్తున్న వర్ల రామయ్య

పౌరాణిక నాటకాలకు తెనాలి పెట్టింది పేరు

● టీడీపీ నేత వర్ల రామయ్య

తెనాలి అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): పౌరాణిక నాటకరంగానికి తెనాలి పెట్టింది పేరని టీడీపీ నేత వర్ల రామయ్య చెప్పారు. పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు ఆరాధ్యుల వెంకటేశ్వరరావును సోమవారం ఆయన పరామర్శించారు. అస్వస్థతకు గురైన ఆయన ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని కోలుకుని మంచి నాటకాలు ప్రదర్శించాలని ఆకాంక్షించారు. ఏవీ సుబ్బారావు కుటుంబం కళారంగానికి గొప్ప నటులను అందించిందని, సినిమా రంగంలో ఎంత క్రేజ్ ఉంటుందో వీరి నటన రంగస్థలానికి అంత అభిమానులను తెచ్చిపెట్టిందన్నారు. ఏవీ సుబ్బారావు శృతిని అందుకోవడానికి రెండు హార్మోనియమ్‌లు వినియోగించేవారని గుర్తు చేశారు. ఆయనతో పాటు పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీరామనవమి ఉత్సవాలు

తెనాలి అర్బన్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): హనుమాన్‌చౌక్‌లోని శ్రీసీతారామ మందిరం వద్ద శ్రీరామ నవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరామ కర్ణామృతం అనే అంశంపై ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. రామతత్వాన్ని ఆచరించాలని, లోకమంతా రామమయం కావాలని పేర్కొన్నారు. అనంతరం శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళా కేంద్రం కళాకారులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. కమిటీ కార్యదర్శి కేవీ సూర్యనారాయణ మూర్తి, విద్యాధర్, రవిశంకర్, రత్నాకరశాస్త్రి, ఆంజనేయశాస్త్రి, వేమూరి విజయభాస్కర్, నరసింహాచార్యులు తదితరులు పర్యవేక్షించారు.



ప్రవచనం చేస్తున్న షణ్ముఖ శర్మ

రైతుల్లో ఉత్సాహాన్ని నింపేలా పోటీలు

● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



సభలో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

తెనాలిరూరల్, మార్చి 31(ఆంధ్రజ్యోతి): రైతుల్లో ఉత్సాహాన్ని, సంతోషాన్ని నింపేలా ఎడ్లబల ప్రదర్శన, పశుపాల పోటీలు ఏర్పాటుచేయడం అభినందనీయమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అన్నారు. ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ ఆధ్వర్యంలో తెనాలి వ్యవసాయమార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ఎడ్లబల, పశుపాల పోటీల్లో మూడో రోజు సోమవారం ముఖ్య అతిథులుగా మంత్రి సత్యకుమార్‌యాదవ్, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి వర్ల రామయ్య, పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అబద్దయ్య, క్రిష్టియన్ కార్పొరేషన్ చైర్మన్ మద్దిరాల నానిలు పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ తెనాలిలో పోటీలకు వేలాదిగా తరలివచ్చిన రైతులను చూస్తుంటే వరల్డ్‌కప్ మ్యాచ్ జరుగుతుందా అన్న అనుమానం కలిగిందన్నారు. యాంత్రీకరణ పెరిగిన ఈ రోజుల్లో కూడా సాంప్రదాయంగా నిర్వహించే ఎద్దుల బల ప్రదర్శనకు ఇంత ఆదరణ ఉంటుందని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆలపాటి రాజేంద్రప్రసాద్ నిర్వహిస్తున్న పోటీలు చూస్తే తెలిసిందన్నారు. ఆలపాటి ఎమ్మెల్సీగా పోటీచేసిన రెండు జిల్లాల్లో సిట్టింగ్ అభ్యర్థిపై అన్ని పోలింగ్ బూతుల్లో భారీ మెజార్టీ సాధించడం వెనుక ఆలపాటికి ప్రజల్లో ఉన్న అభిమానం ఏ పాటిదో అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రైతుల్లో ఉత్సాహాన్ని నింపేలా జరిగే ఎడ్ల బలప్రదర్శన, పశుపాల పోటీలను ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు నేతృత్వంలో జాతీయస్థాయిలో నిర్వహించడం అభినందనీయమన్నారు. వర్ల రామయ్య మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో అరాచకాలు తప్ప ఆనందం లేదని ఆరోపించారు. వ్యవసాయంపైనే జీవనం సాగించే రైతులను కోలుకోలేని దెబ్బతీసిన ఏకైక ప్రభుత్వం వైసీపీనేనని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ నరేంద్రమోడీల సహకారంతో రైతాంగానికి అండగా నిలుస్తూ వ్యవసాయాన్ని లాభసాటి చేస్తూ భావి తరాలు కూడా అన్నదాతలుగా కొనసాగుతూ ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా మార్చేలా పాలన సాగిస్తుందన్నారు. పీ-4 సమావేశం ద్వారా సంపన్నులకు దీటుగా పేదలుకూడా అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్షిస్తూ ముందుకు సాగుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ నవ్యాంధ్రప్రదేశ్‌గా మారడంతోపాటు అన్ని రంగాలు ప్రజలు సంతోషంగా జీవించేలా కూటమి పాలన జరుగుతుందన్నారు. పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అబద్దయ్య మాట్లాడుతూ వేలాది మంది రైతులను ఆనందింపజేసేలా పోటీలు నిర్వహించిన ఆలపాటికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. క్రిష్టియన్ కార్పొరేషన్ చైర్మన్ మద్దిరాల మ్యాని మాట్లాడుతూ ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించడమంటే ఎంతో శ్రమతో కూడిందని ఇటువంటి మంచి కార్యక్రమం చేపట్టిన ఆలపాటికి, కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. వివిధ రంగాల ప్రముఖులు ప్రసంగించారు. తొలుత అతిథులను కన్వీనర్ ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు సత్కరించారు. పుంగనూరు ఆవులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నిర్వాహక కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ఓనర్‌పై దాడి

తెనాలి, మారీసుపేట, మార్చి 31(ఆంధ్రజ్యోతి): ఇంటికి ఆలస్యంగా రావద్దన్నందుకు ఇంటి ఓనర్‌పై దాడిచేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఐతానగర్ కు చెందిన మండపేట ఉదయసాగర్ తన భార్య, దివ్యాంగుడైన తన అన్నతో కలసి జీవనం సాగిస్తున్నాడు. తన ఇంటిపైన మొదటి అంతస్తులో ఉన్న పోర్షన్‌ను పెయింట్ కార్మికుడైన ప్రశాంత్ కుటుంబానికి అద్దెకిచ్చాడు. అయితే ప్రశాంత్ మద్యానికి బానిసై ఇంటికి ఆలస్యంగా రావడం, గోడ దూకి రావడం చేస్తుండటంతో ఇంటికి త్వరగా రావాలని లేకుంటే ఇల్లు ఖాళీ చేయాలని చెప్పాడు. ఈ క్రమంలో ఆదివారం కూడా తాగి రావడాన్ని గమనించి ప్రశాంత్‌ని ఇల్లు ఖాళీ చేయాలని ఉదయసాగర్ కోరగా అతనిపై దాడి చేశాడు. జిల్లా వైద్యశాలలో చికిత్స పొందిన బాధితుడు సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. ప్రశాంత్ కూడా తనపై ఉదయసాగర్ దాడి చేశాడని ఫిర్యాదు చేశాడు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రహదారుల వెంబడి వ్యర్థాల కుప్పలు

● దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



దావులూరు సమీపంలో రోడ్డు పక్కన పోసిన వ్యర్థాలు

కొల్లిపర, మార్చి 31 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సంకల్పం వైపు అడుగులు వేద్దామని ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రితో సహా పలువురు పిలుపు ఇస్తుంటే గ్రామీణ ప్రాంతాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. గ్రామాల్లో గృహాల నుంచి వచ్చిన వ్యర్థాలు, రోడ్లపైన ఉన్న చెత్తను ఒకచోట చేర్చేందుకు కంపోస్టు యార్డులు ఏర్పాటు చేశారు. కంపోస్టు యార్డులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రభుత్వాలు ఆదేశించినా ఎక్కడ ఆమలు కావడం లేదు. కొల్లిపర మండల పరిధిలో పలు గ్రామాల్లో ప్రయాణించాలంటే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో సేకరించిన వ్యర్థాలను రహదారుల పక్కన పడవేయడంతో ఈ సమస్య ఏర్పడుతోంది. రోజుల తరబడి వ్యర్థాలు నిల్వ ఉంటే భరించలేని దుర్వాసన వెదజల్లుతుండటంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించాలంటే భయపడుతున్నారు. మేజర్ పంచాయతీల్లో సేకరించిన వ్యర్థాలను ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా ఊరికి శివారులో ఉన్న ప్రాంతాలకు తరలించి రోడ్డు పక్కనే పారబోస్తున్నారు. వ్యర్థాలలో వరాహాలు, మూగజీవాలు సంచరిస్తుండటంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. అంతేకాకుండా సేకరించిన పొడిచెత్తను తగల బెడుతుండటంతో రహదారి మొత్తం పొగ అవరించి దారి కనిపించకుండా పోతోంది. దీంతో వాహనదారులు ఏ మాత్రం అదమరిచినా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మండల పరిధిలో అత్తోట నుంచి యాదవపాలెం వెళ్ళే రోడ్డు, దంతలూరు నుంచి మున్నంగి వెళ్లే రోడ్డు, తూములూరు నుంచి దావులూరు వెళ్లే రోడ్డులో వ్యర్థాలు పారబోస్తుండటంతో రోడ్లు మూసుకుపోతున్నాయి. దీంతో ఈ రోడ్లపై వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వ్యర్థాలపై అనేక పర్యాయాలు అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మున్నంగి రోడ్డు పక్కన పోసిన వ్యర్థాలు